manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY









వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 76 | మంగళవారం 1 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్


# రిటైరైనా.. 'కుర్చీ' వదలరా!

తెలంగాణలో రిటైర్డ్ అధికారుల 'రీ ఎంట్రీ'పై దుమారం



జడ్పీ సీఈఓగా రిటైర్డ్ అయినా రాం రెడ్డి

**పదవీ విరమణ పొందినా మళ్లీ కీలక పోస్టింగులు.. ఎవరి ఆశీస్సులతో?**

**పనిచేస్తున్న అధికారుల పదోన్నతులకు బ్రేక్.. అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఆవేదన**

**ప్రత్యేక నైపుణ్యమా?.. అధికారుల కొరతా?.. లేక పలుకుబడే అర్హతా?**

**వరంగల్ మాజీ జడ్పీ సీఈఓ రాంరెడ్డికి 'హౌసింగ్ పీడీ'గా అవకాశం అంటూ అధికారవర్గాల్లో చర్చ**

**'కుడా'లోనూ ఇద్దరు రిటైర్డ్ అధికారులకు మళ్లీ కొలువులంటూ విమర్శలు**

**పునర్నియామకాలన్నీ బయటపెట్టాలి.. ఉత్తర్వులు, అర్హతలు, ఎంపిక ప్రాతిపదిక వెల్లడించాలనే డిమాండ్**

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 31(మన విశ్వం):** రిటైర్మెంట్ తీసుకున్నారు.. వీడ్కోలు సభలు జరిగాయి.. సన్మానాలు అందుకున్నారు.. ఇక విశ్రాంత జీవితం అనుకుంటున్నారా? కొందరు అధికారుల విషయంలో మాత్రం కథ అక్కడితో ముగియడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పదవీ విరమణ చేసిన కొందరు అధికారులు మళ్లీ ప్రభుత్వ వ్యవస్థలో కీలక కుర్చీల్లోకి వస్తున్నారన్న వ్యవహారం తెలంగాణలో చర్చనీయాంశంగా మారుతోంది. ప్రభుత్వ శాఖల్లో పదోన్నతుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న అధికారులు ఒకవైపు.. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగ యువత మరోవైపు.. ఈ పరిస్థితుల్లో రిటైరైన వారికే తిరిగి కీలక బాధ్యతలు ఎందుకన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది.

**రిటైర్మెంట్ తర్వాత.. 'రీ ఎంట్రీ'!**

ప్రత్యేక పరిస్థితుల్లో అనుభవజ్ఞులైన రిటైర్డ్ అధికారుల సేవలను ప్రభుత్వం వినియోగించుకోవడం కొత్తేమీ కాదు. కానీ అది మినహాయింపుగా

మిగతా 2లో..

# 'నీకు.. నాకు పోలికనా కేసీఆర్?'

- పదేళ్లలో నువ్వేం చేశావో.. వెయ్యి రోజుల్లో నేనేం చేశానో తేల్చుకుందాం
- 'దమ్ముంటే అసెంబ్లీకి రా.. ప్రజల ముందే చర్చకు నేను సిద్ధం'
- 'కుటుంబానికి నువ్వు పదవులిస్తే.. బలహీనవర్గాలకు నేను అవకాశమిచ్చా'
- ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం

**హైదరాబాద్, ఆగస్టు 31(మన విశ్వం):** " నీకు.. నాకు పోలికనా కెసిఆర్? పదేళ్లు ముఖ్యమంత్రిగా నువ్వేం చేశావో చెప్పు.. వెయ్యి రోజుల్లో నేను ఏం చేశానో చెబుతా. దమ్ముంటే అసెంబ్లీకి రా.. ప్రజల ముందే తేల్చుకుందాం "అంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. వెయ్యి రోజులుగా ప్రతిపక్ష నేతగా ప్రజల కోసం ఒక్కరోజైనా పనిచేశారా? అని ప్రశ్నించారు. బాధ్యత నిర్వర్తించకుంటే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మూసీ నదిపై అంబర్‌పేట--దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో రూ.52 కోట్లతో నిర్మించిన 400 మీటర్ల ముసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని సోమవారం సీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కేసీఆర్, బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే కొడుకు, అల్లుడిని మంత్రులను చేశారు. నేను పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరికి అవకాశం ఇచ్చాను. ఎర్రబెల్లి దయాకర్ రావును నువ్వు మంత్రిని చేస్తే.. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నేను మంత్రిని చేశాను. వెంకట్రామిరెడ్డిని నువ్వు ఎమ్మెల్సీ చేస్తే.. అద్దంకి దయాకర్‌కు నేను అవకాశం ఇచ్చాను. నీ కొడుకును పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను చేస్తే.. బలహీన వర్గాల బిడ్డ మహేష్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిని చేశాం." నీకు.. నాకు పోలికనా? " అని

మిగతా 2లో..



# 'వెయ్యి రోజుల' వార్!

**కేసీఆర్ రాజీనామా కోసం కాంగ్రెస్.. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట**

**'వెయ్యి రోజులుగా ప్రతిపక్ష నేత బయటకు రాలేదు.. పదవిలో ఉండటమెందుకు?': రేవంత్**

**'420 హామీలతో ప్రజలను మోసం చేశారు.. వెయ్యి రోజుల పాలనపై చార్జిషీట్': కేటీఆర్**

**ఆరు రోజుల నిరసనలకు కాంగ్రెస్ పిలుపు.. ఏడు రోజుల ఆందోళనలకు బీఆర్ఎస్ కార్యాచరణ**




**హైదరాబాద్, ఆగస్టు 31 (మన విశ్వం):** తెలంగాణ రాజకీయాల్లో 'వెయ్యి రోజుల' యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ వారం రోజుల పోరుబాటకు సిద్ధమవుతుండగా.. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వెయ్యి రోజుల పనితీరునే ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ఎదురుదాడికి దిగుతోంది. "వెయ్యి రోజులుగా ప్రజల్లోకి రాని కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి" అంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునివ్వగా.. "వెయ్యి రోజులైనా ఎన్నికల హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల ముందు నిలదీస్తాం" అంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రకటించారు. దీంతో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఒకదానిపై మరొకటి వరుస ఆందోళనలకు సిద్ధమయ్యాయి.

**'ప్రభుత్వం కాదు.. ప్రతిపక్షమే విఫలం'**

"ఎక్కడైనా ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షం పోరాడుతుంది. తెలంగాణలో మాత్రం ప్రతిపక్ష నాయకుడే విఫలమయ్యారు" అంటూ

మిగతా 2లో..

# 'చేయూత'కు మరో 15 రోజులు!

- పింఛన్ దరఖాస్తులకు సెప్టెంబర్ 15 వరకు గడువు
- అర్హులకు మరో అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆగస్టు 31తో ముగిసిన గడువు.. విజ్ఞప్తులతో పొడిగింపు
- కొత్తగా 2.50 లక్షల పింఛన్ల మంజూరుకు సర్కారు కసరత్తు
- దరఖాస్తుల పరిశీలన తర్వాత అర్హుల ఎంపిక.. క్షేత్రస్థాయి విచారణకు సన్నాహాలు




వివరాలు 2లో..




# ప్రజలను తిప్పితే.. వేటే!

- రెవెన్యూ అధికారులకు మంత్రి పొంగులేటి స్ట్రాంగ్ వార్నింగ్
- 22ఏలో సొంత నిర్ణయాలు వద్దు.. నిబంధనలు దాటితే సహించేది లేదు
- ఆఫీసుల్లో కూర్చుంటే సరిపోదు.. క్షేత్రంలోకి వెళ్లి సమస్యలు పరిష్కరించండి
- ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే కఠిన చర్యలు.. మహబూబాబాద్ సమీక్షలో స్పష్టీకరణ

**మహబూబాబాద్, ఆగస్టు 31 (మన విశ్వం):** "ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు. సమస్యల పరిష్కారంలో బాధ్యతగా, పారదర్శకంగా వ్యవహరించండి. విధుల్లో నిర్లక్ష్యం వహించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవు" అని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. 22ఏ నిషేధిత జాబితా, భూ సమస్యల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై నిర్వహిస్తున్న సమీక్షల్లో భాగంగా సోమవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాపై మంత్రి పొంగులేటి సమగ్ర సమీక్ష నిర్వహించారు. మండలస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు, ప్రజాప్రతినిధులతో కలిసి శాఖలవారీగా సమస్యలు, వాటి పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు.

**22ఏలో ఇష్టారాజ్యం వద్దు**

22ఏ నిషేధిత జాబితాలోని భూములు, ఇతర రెవెన్యూ సమస్యల విషయంలో అధికారులు నిబంధనలనే ప్రామాణికంగా తీసుకోవాలని మంత్రి స్పష్టం

మిగతా 2లో..

# నల్లగొండలో 'హస్తం-కమలం' యుద్ధం!

**మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంపై కోడిగుడ్లు, టమాటాలతో బీజేపీ నిరసన**

**భగ్గుమన్న కాంగ్రెస్.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి ఇంటివైపు దూకుడు**


**దాడిలో ఫర్నిచర్ ధ్వంసమైందని ఆరోపణ.. బీజేపీ కార్యాలయం వద్ద మళ్లీ ఉద్రిక్తత**

**నల్లగొండ, ఆగస్టు 31 (మన విశ్వం):** అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ పోరు సోమవారం నల్లగొండలో దాడులు, ప్రతిదాడుల స్థాయికి చేరింది. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద మొదలైన ఉద్రిక్తత సాయంత్రానికి నల్లగొండను తాకింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద బీజేపీ నిరసన.. దానికి ప్రతిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసం వైపు కాంగ్రెస్ కార్యకర్తల దూకుడు.. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద పోలీసులతో తోపులాటతో జిల్లా కేంద్రం రాజకీయ

మిగతా 2లో..

# ఒక్క 'ఆపరేటర్' చేతిలో ఇన్ని తాళాలా?

- డీఈవో కార్యాలయంలో కీలక వ్యవహారాలన్నీ ఆయన చుట్టూనేనా?
- బిల్లులు.. పేరోల్స్.. ఆడిట్.. వోచర్లు.. అసలు అధికారిక బాధ్యతలేమిటి?
- పర్యవేక్షణ ఎవరిది?.. అధికారుల మౌనంపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలు
- రికార్డుల తనిఖీ చేస్తేనే ఆరోపణల్లో నిజమెంతో తేలే అవకాశం



**హన్మకొండ, ఆగస్టు 31 (మన విశ్వం):** జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ చుట్టూ వస్తున్న వరుస ఆరోపణల కంటే ఇప్పుడు మరో కీలక ప్రశ్న ముందుకొస్తోంది. అసలు ఒక ఆపరేటర్ కు బిల్లులు, జీతాల పేరోల్స్, ఆడిట్, వోచర్లు, పాఠశాలలకు సంబంధించిన సామాగ్రి వంటి కీలక వ్యవహారాల్లో ఇంతటి ప్రమేయం ఎలా సాధ్యమైంది? ఆయనకు అధికారికంగా అప్పగించిన బాధ్యతలేమిటి? ఆ పరిధిని మించి వ్యవహరించినట్లయితే పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేశారు? అన్నది చర్చనీయాంశంగా

మిగతా 2లో..

# 'ప్రశాంత్‌రెడ్డిని వదిలిపెట్టను!'

- 'సంతోష్, హరీశ్‌ను క్షమిస్తానేమో.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం జీవితంలో క్షమించను'
- 'శకునిలా మారి నాన్న కేసీఆర్‌కు, నాకు మధ్య చిచ్చుపెట్టారు'
- 'వచ్చే ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేసినా వెంటపడి మరీ ఓడిస్తా'
- బీఆర్ఎస్ నుంచి గెంటేశారంటూ కన్నీటి పర్యంతమైన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు
- 'తీహార్‌కు పంపిన వారికి ఎన్నికల గెలుపుతోనే సమాధానం చెబుతా'

నిజామాబాద్ గడ్డపై కవిత శపథం




**నిజామాబాద్, ఆగస్టు 31 (మన విశ్వం):** నిజామాబాద్ గడ్డపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయంగా నిప్పులు చెరిగారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "సంతోష్‌రావు, హరీశ్‌రావులను ఎప్పటికైనా క్షమిస్తానేమో.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం జీవితంలో క్షమించను. వచ్చే ఎన్నికల్లో ఆయన

మిగతా 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# కడుపు నిండినా.. పోషణేదీ?

దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దూసుకెళ్తోంది. గోదాములు ధాన్యంతో నిండుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తోంది. సాంకేతికతలో కొత్త శిఖరాలను అందుకుంటోంది. అయినా చిన్నారుల్లో పోషకాహార లోపం, మహిళల్లో రక్తహీనత వంటి సమస్యలు పూర్తిగా తొలగిపోవడం లేదు. ఇదో వైరుధ్యం. దేశంలో ఆహారానికి కొదవ లేకున్నా.. అందరి పళ్లెంలో అవసరమైన పోషకాలు ఉండటం లేదు. కడుపు నిండుతోంది. శరీరానికి కావాల్సిన బలం మాత్రం అందడం లేదు. ఈ పరిస్థితి మారకుండా ఆరోగ్యవంతమైన భారత్ సాధ్యం కాదు.

ఆకలి తీర్చడమే ఆహార భద్రతకు పరమావధి కాకూడదు. బియ్యం, గోధుమలు అందుబాటులో ఉంచినంత మాత్రాన బాధ్యత పూర్తయినట్లు కాదు. పప్పులు, గుడ్లు, పాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటి పోషక పదార్థాలు సామాన్య కుటుంబాలకూ అందుబాటులో ఉండాలి. శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, సూక్ష్మ పోషకాలు అందినప్పుడే ఆహారానికి సార్థకత. అందుకే ఇక ఆహార భద్రతతో పాటు 'పోషక భద్రత' నూ ప్రభుత్వ విధానాల్లో ప్రధాన లక్ష్యంగా మార్చాలి.

పిల్లల విషయంలో ఇది మరింత కీలకం. గర్భధారణ నుంచి బిడ్డ రెండేళ్ల వయసు వరకు ఉండే తొలి వెయ్యి రోజుల్లో అందే పోషణే భవిష్యత్తుకు పునాది. ఆ సమయంలో లోపం ఏర్పడితే శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసంపైనా ప్రభావం పడుతుంది. రోగనిరోధక శక్తి తగ్గుతుంది. చదువుకునే సామర్థ్యం దెబ్బతినవచ్చు. బాల్యంలో జరిగిన నష్టం తర్వాత పూర్తిగా సరిదిద్దడం కష్టమవుతుంది. అందుకే చిన్నారికి అందించే పౌష్టికాహారాన్ని సంక్షేమంగా కాకుండా దేశ భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాలి.

మహిళల ఆరోగ్యమూ అంతే ముఖ్యం. బాలికల్లో పోషకాహార లోపం.. మహిళల్లో రక్తహీనత.. గర్భిణులు, బాలింతలకు సమతుల ఆహారం అందకపోవడం ఒక తరం నుంచి మరో తరానికి సమస్యను మోసుకెళ్లే ప్రమాదం కలిగిస్తుంది. తల్లి బలహీనంగా ఉంటే బిడ్డ ఆరోగ్యంపైనా ప్రభావం పడుతుంది. కుటుంబంలో అందరికీ పెట్టాక మహిళ తినాలనే పాత ధోరణి మారాలి. ఆమెకు పోషకాహారం అందించడం కుటుంబ అవసరంగానే కాదు.. సామాజిక బాధ్యతగానూ గుర్తించాలి. తల్లిని బలోపేతం చేయకుండా తరాన్ని బలోపేతం చేయలేం.

ప్రభుత్వ పథకాలకు కొదవ లేదు. అంగన్‌వాడీలు ఉన్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందుతోంది. గర్భిణులు, బాలింతలకు పోషక సహాయ కార్యక్రమాలున్నాయి. పోషణ్ అభియాన్ వంటి ప్రత్యేక కార్యక్రమాలూ అమలవుతున్నాయి. అసలు ప్రశ్న వాటి అమలులోనే ఉంది. కేటాయించిన ఆహారం లబ్ధిదారులకు పూర్తిగా చేరుతోందా? నాణ్యత ఎలా ఉంది? పిల్లల బరువు, ఎదుగుదలను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా? లోపం కనిపిస్తే వెంటనే స్పందిస్తున్నారా? పోషకాహార సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారా? వీటికి జవాబు కావాలి. పథకం ఫైలులో కాదు చిన్నారి ఆరోగ్యంలో కనిపించాలి.

మరోవైపు దేశంలో ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. పోషకాలు అందక ఒక వర్గం ఇబ్బందులు పడుతుంటే.. అధిక కేలరీలు, తక్కువ పోషక విలువలున్న ఆహారం మరో వర్గాన్ని అనారోగ్యం వైపు నెడుతోంది. జంక్‌ఫుడ్, అధిక చక్కెర, ఉప్పు, కొవ్వులతో కూడిన పదార్థాల వినియోగం పెరుగుతోంది. ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులకు ఇది దారితీస్తోంది. ఒకచోట పోషకాహార లోపం.. మరోచోట అనారోగ్యకర ఆహారపు మోతాదు. ఈ ద్వంద్వ సమస్యకు సమతుల ఆహారమే సమాధానం.

పోషకాహారం అంటే ఖరీదైన పదార్థాలనే కొనాలనే అపోహ వద్దు. మన పొలాల్లో పండే జొన్నలు, సజ్జలు, రాగులు.. పప్పులు, వేరుశనగ, నువ్వులు.. ఇంటి పరిసరాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలు.. గుడ్లు, పాలు, స్థానిక పండ్లు మంచి పోషక వనరులే. ఒకప్పుడు మన పళ్లెంలో సహజంగా కనిపించిన వీటిని ఆధునిక జీవనశైలి క్రమంగా దూరం చేసింది. సంప్రదాయ ఆహారంలోని మంచిని తిరిగి అందిపుచ్చుకోవాలి. స్థానికంగా లభించే ఆహారంతోనే తక్కువ ఖర్చులో సమతుల పోషణ సాధ్యమనే అవగాహన పెంచాలి.

ఇందుకు ప్రభుత్వం ఒక్కటే చేయగలిగింది పరిమితం. కుటుంబం నుంచే మార్పు మొదలవ్వాలి. పిల్లలకు ఏం పెట్టాలి? గర్భిణులు ఏం తినాలి? రక్తహీనతను ఎలా నివారించాలి? తక్కువ ఆదాయంలోనే సమతుల ఆహారం ఎలా సిద్ధం చేసుకోవాలి? అనే విషయాలు ప్రతి ఇంటికీ చేరాలి. అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, వైద్యులు, ఉపాధ్యాయులు ఈ విషయంలో చైతన్య సారథులుగా మారాలి. పాఠశాల నుంచే పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలి. మీడియా కూడా దీనిని సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలి.

దేశ ప్రగతిని జీడీపీ అంకెలతోనే కొలిచే రోజులు మారాలి. ఎన్ని కోట్ల టన్నుల ధాన్యం పండించామన్నదే కాదు.. ఆ ధాన్య సమృద్ధి ప్రజల ఆరోగ్యాన్ని ఎంత మెరుగుపరిచిందన్నదీ చూడాలి. ఏ చిన్నారీ పోషకాహార లోపంతో ఎదుగుదల కోల్పోకూడదు. ఏ మహిళా రక్తహీనతను విధిగా భరించకూడదు. పేదరికం కారణంగా ఏ కుటుంబమూ సమతుల ఆహారానికి దూరం కాకూడదు.ఆకలి లేని భారత్ మాత్రమే సరిపోదు.. పోషకాహార లోపం లేని భారత్ కావాలి. గోదాముల్లో ధాన్యం ఎంత ఉందన్నదానికంటే.. ప్రతి చిన్నారి పళ్లెం లో పోషణ ఎంత ఉందన్నదే ముఖ్యం. కడుపు నింపడం సంక్షేమమైతే.. ఆరోగ్యాన్ని నిర్మించడం అభివృద్ధి. ఆ లక్ష్యంతోనే ప్రభుత్వ విధానాలు, కుటుంబాల ఆహారపు అలవాట్లు మారాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన భారత్ కు బలమైన పునాది పడుతుంది.

– నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్

# నల్లగొండలో 'హస్తం-కమలం' యుద్ధం!

(మొదటిపేజీ తరువాయి)

రణరంగాన్ని తలపించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేయడంతోపాటు కార్యాలయం గేటుకు నల్లరంగు పూశాయి. దీనికి ప్రతిగా బీజేవైఎం కార్యకర్తలు గాంధీభవన్ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సెగ కొద్దిగంటల్లోనే నల్లగొండకు విస్తరించింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి, ఫ్లెక్సీని ధ్వంసం చేశారు. క్యాంపు కార్యాలయం వైపు కోడిగుడ్లు, టమాటాలు విసరడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనతో కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు వర్షిత్‌రెడ్డి నివాసం వైపు వెళ్లారు. ఈ సందర్భంగా ఇంటిపై దాడి జరిగిందని, ఫర్నిచర్ ధ్వంసమైందని బీజేపీ ఆరోపించింది. వర్షిత్‌రెడ్డి తల్లికి గాయాలయ్యాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై అధికారిక పోలీసు వివరాలు వెల్లడికావాల్సి ఉంది. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ జిల్లా కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

# 'ప్రశాంత్‌రెడ్డిని వదిలిపెట్టను!'

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కడ పోటీ చేసినా వెంటపడి మరీ ఓడిస్తా" అని హెచ్చరించారు. తనకు, తన తండ్రి కేసీఆర్‌కు మధ్య విభేదాలు సృష్టించారని ఆరోపిస్తూ ప్రశాంత్‌రెడ్డిని మహాభారతంలోని 'శకుని'తో పోల్చారు. తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు తర్వాత తొలిసారి నిజామాబాద్‌లో నిర్వహించిన 'పాంచజన్య' సభలో కవిత ప్రసంగించారు. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తాను జైలుకు వెళ్లానని పెద్ద నాయకులే చెప్పారని, అలాంటి తనను చివరకు పుట్టిల్లులాంటి పార్టీ నుంచే బయటకు పంపారని కన్నీటి పర్యంతమయ్యారు. "జైలు నుంచి వచ్చిన నన్ను ఆదరించాల్సిన పుట్టిల్లే బయటకు పంపింది. కన్నీళ్లు వచ్చాయని నేను పిరికిదాన్ని కాదు. బాధ, ఆవేశమే కన్నీళ్లుగా వచ్చాయి" అని కవిత పేర్కొన్నారు. ఈ సమయంలో కార్యకర్తలు 'కవిత సీఎం.. సీఎం..' అంటూ నినాదాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా తీహార్ జైలుకు పంపారని, అందుకు ఎన్నికల్లో గెలిచి సమాధానం చెబుతానని కవిత ప్రకటించారు. తెలంగాణలో ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయని, కొత్త రాజకీయ శక్తి అవసరమనే ఉద్దేశంతోనే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లొచ్చాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై పోరాడాల్సిన బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీల నుంచి తప్పించుకుంటున్నారని విమర్శించారు. ప్రతి నియోజకవర్గానికి 'షాడో ఎమ్మెల్యే'లను నియమించి ప్రభుత్వ పనితీరు, అవినీతిని ప్రజల ముందు ఉంచుతామని కవిత ప్రకటించారు. సామాజిక న్యాయం, పాలనలో మార్పే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "నేను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను. పదవుల కోసం కాదు.. ప్రజల కోసం వచ్చాను. కొత్త వాళ్లతో కొత్త చరిత్ర రాద్దాం" అంటూ పిలుపునిచ్చారు.

# రిటైరైనా.. 'కుర్చీ' వదలరా!

(మొదటిపేజీ తరువాయి)

ఉండాల్సింది పోయి సాధారణ పద్ధతిగా మారుతోందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పోస్టులకు అర్హులైన రెగ్యులర్ అధికారులు అందుబాటులో ఉన్నప్పటికీ రిటైర్డ్ అధికారుల వైపు ఎందుకు మొగ్గుచూపుతున్నారన్నది ఉద్యోగవర్గాల ప్రశ్న. ఒక కీలక పోస్టును రిటైర్డ్ అధికారితో భర్తీ చేస్తే ఆ స్థానంపై ఆశలు పెట్టుకున్న రెగ్యులర్ అధికారికి అవకాశం ఎప్పుడు? అతడి స్థానంలోకి రావాల్సిన మరో అధికారికి పదోన్నతి ఎప్పుడు? ఇలా మొత్తం పదోన్నతుల గొలుసుపైనే ప్రభావం పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**పైరవీ ఉంటే.. పోస్టింగ్ పక్కానా?**

రిటైర్మెంట్‌కు ముందే కొందరు అధికారులు తమ 'సెకండ్ ఇన్నింగ్స్' కోసం ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారన్న ఆరోపణలు అధికార వర్గాల్లో వినిపిస్తున్నాయి. రాజకీయ నేతలు, ఉన్నతస్థాయి అధికారుల వద్ద పలుకుబడి ఉపయోగించి తిరిగి పోస్టులు సంపాదిస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. అంతేకాదు.. కొన్ని పునర్నియామకాల వెనుక ముడుపులు, పైరవీలు పనిచేస్తున్నాయనే తీవ్ర ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. అయితే అలాంటి ఆరోపణలకు ఆధారాలు బయటకు రావాల్సి ఉంది. అందుకే ప్రభుత్వం పునర్నియామకాల వివరాలను బహిర్గతం చేసి అనుమానాలకు తెరదించాలని ఉద్యోగవర్గాలు కోరుతున్నాయి.

**వరంగల్‌లో 'రాంరెడ్డి' రీ ఎంట్రీ!**

ఈ చర్చకు వరంగల్‌లో జరుగుతున్న పరిణామాలు మరింత బలం చేకూరుస్తున్నాయి. వరంగల్ జడ్పీ సీఈఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన రాంరెడ్డికి మళ్లీ కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారన్న ప్రచారం అధికార వర్గాల్లో జోరుగా సాగుతోంది.

**ఆయనకు హౌసింగ్ పీడీగా అవకాశం**

కల్పించారని, నేడో రేపో బాధ్యతలు స్వీకరించనున్నారన్న సమాచారం చక్కర్లు కొడుతోంది. అదే నిజమైతే–ఆ పోస్టుకు రెగ్యులర్ అధికారులు లేరా? రిటైరైన అధికారినే తిరిగి తీసుకోవాల్సిన ప్రత్యేక అవసరం ఏమిటి? ఎంపికకు అనుసరించిన ప్రమాణాలేంటి? ప్రభుత్వం ఏ నిబంధన కింద ఈ అవకాశం కల్పించింది? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంది.

**'కుడా'లోనూ రిటైర్డ్ రాజ్యం?**

వరంగల్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)లోనూ ఇద్దరు రిటైర్డ్ అధికారులకు మళ్లీ బాధ్యతలు అప్పగించినట్లు ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. పట్టణ ప్రణాళిక, అభివృద్ధిలో కీలకమైన సంస్థలో రిటైర్డ్ అధికారులనే తిరిగి ఎందుకు ఆశ్రయించాల్సి వచ్చిందన్న ప్రశ్న తలెత్తుతోంది. వారి స్థానాల్లో పనిచేసేందుకు అర్హులైన రెగ్యులర్ అధికారులు లేరా? ఉంటే వారికి ఎందుకు అవకాశం ఇవ్వలేదు? లేక ఆయా పోస్టులకు ప్రత్యేక అనుభవం తప్పనిసరా? అదే అయితే ఆ విషయాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయడంలో అభ్యంతరమేంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**ఉద్యోగులకు 'నో'.. రిటైర్డ్‌లకు 'వెల్‌కమ్'?**

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పదోన్నతులు, ఖాళీల భర్తీ కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగం కోసం యువత ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతోంది. ఇలాంటి సమయంలో పదవీ విరమణ చేసిన అధికారులను తిరిగి కీలక పోస్టుల్లో నియమించడం ఎలాంటి సంకేతం ఇస్తుందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రతి రిటైర్డ్ అధికారి నియామకం ఒక నిరుద్యోగి ఉద్యోగాన్ని నేరుగా లాక్కున్నట్లేనని చెప్పడం సరికాదు. కానీ రెగ్యులర్ క్యాడర్‌లో భర్తీ చేయగల పోస్టులను పునర్నియామకాలతో నింపితే పదోన్నతులు, తదుపరి ఖాళీలపై ప్రభావం ఉంటుందా లేదా అన్నది ప్రభుత్వం స్పష్టం చేయాల్సిందే.

**'సెకండ్ ఇన్నింగ్స్'కు అర్హతేంటి?**

రిటైర్డ్ అధికారులను తిరిగి నియమించేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రమాణాలేంటి? ఎన్ని శాఖల్లో ఎంతమంది ప్రస్తుతం పునర్నియామకంపై కొనసాగుతున్నారు? వారికి చెల్లిస్తున్న వేతనాలు ఎంత? నియామక కాలపరిమితి ఎంత? రెగ్యులర్ అధికారులు అందుబాటులో ఉన్నారా లేదా పరిశీలించారా? ప్రత్యేక నైపుణ్యం అవసరమని ఎవరు నిర్ణయిస్తున్నారు? ఈ వివరాలన్నింటిని ప్రభుత్వం ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వం 'రిటైర్డ్ లిస్ట్' బయటపెడుతుందా?**

రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ముఖ్యంగా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖలు, కార్పొరేషన్లు, సంస్థలు, ప్రాజెక్టుల్లో పునర్నియామకం పొందిన రిటైర్డ్ అధికారుల పూర్తి జాబితాను ప్రభుత్వం వెల్లడించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఎవరు? ఎక్కడ రిటైరయ్యారు? తిరిగి ఏ పోస్టులో చేరారు? ఎవరి సిఫార్సుతో నియామకం జరిగింది? ఏ నిబంధన ప్రకారం ఉత్తర్వులు ఇచ్చారు? ఎంత వేతనం చెల్లిస్తున్నారు? అనే వివరాలు బయటకొస్తేనే అసలు చిత్రం తేలనుంది. రిటైర్మెంట్ అంటే విశ్రాంతా?.. మరో కుర్చీ కోసం' వెయిటింగ్ 'నా? అర్హులైన అధికారులకు ప్రమోషన్లు ఎప్పుడు?.. యువతకు అవకాశాలు ఎప్పుడు? రిటైర్డ్ అధికారుల 'రీ ఎంట్రీ 'వెనుక అసలు కథేంటి?

**తెలంగాణలో జరుగుతున్న పునర్నియామకాలపై ప్రభుత్వం సమగ్ర వివరాలు వెల్లడిస్తేనే ఈ ప్రశ్నలకు సమాధానం దొరకనుంది.**

# 'వెయ్యి రోజుల' వార్!

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నేతగా వెయ్యి రోజుల్లో కేసీఆర్ రూ.1.24 కోట్ల జీతం తీసుకున్నారని, ఆయన భద్రత, నివాస వసతులకు ప్రభుత్వం మరో రూ.21 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. "జీతం తీసుకుని ఉద్యోగానికి రాకపోతే ఏం చేస్తారు? ప్రభుత్వ ఉద్యోగి విధులకు రాకపోతే చర్యలు ఉండవా?" అని ప్రశ్నించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగోలేకపోతే బయటకు వచ్చే కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజల సమస్యలు పట్టవా? అని సీఎం నిలదీశారు. రేషన్‌కార్డులు, సన్నబియ్యం, పేదలకు ఇళ్ల గురించి గత ప్రభుత్వం ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆరు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**'వెయ్యి రోజుల మోసంపై పోరుబాట'**

మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ కూడా పోరాట కార్యాచరణ ప్రకటించింది. "వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. వెయ్యి రోజులు గడిచినా ప్రధాన హామీలు నెరవేరలేదు. 420 హామీల మోసాన్ని ఇంటింటికీ తీసుకెళ్తాం" అని కేటీఆర్ పేర్కొన్నారు. సెప్టెంబరు 1న తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై చార్జిషీట్ విడుదల చేసి, 2 నుంచి వరుసగా ఏడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఆరు గ్యారెంటీల అమలుపై 2న నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, 'బాకీ కార్డుల' పంపిణీ చేపట్టనున్నారు. 3న రైతు సమస్యలు, 22ఏ భూములపై ఆందోళనలు; 4న మహిళలు, దివ్యాంగుల సమస్యలపై సదస్సులు, వంటావార్పు; 5న విద్యార్థులు, యువతతో ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. 6న హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటో ర్యాలీతోపాటు గ్రామాల్లో స్థానిక సమస్యలపై నిరసనలు, 7న ప్రజావాణి కేంద్రాల్లో వినతిపత్రాలు, 8న జిల్లా కేంద్రాల్లో మీడియా సమావేశాలు నిర్వహించనున్నారు.

**ఒకరిపై ఒకరు.. పోటాపోటీ నిరసనలు**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నది బీఆర్ఎస్ వాదన. అదే వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన బాధ్యత నిర్వర్తించలేదన్నది కాంగ్రెస్ ఎదురుదాడి. ' ప్రభుత్వం విఫలం' అంటూ కేటీఆర్ పార్టీ శ్రేణులను వీధుల్లోకి రమ్మంటుంటే.. 'ప్రతిపక్ష నేతే విఫలం' అంటూ రేవంత్ కాంగ్రెస్ శ్రేణులకు ఆందోళనల పిలుపునిచ్చారు. సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈ రాజకీయ పోరు సభలోనూ మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి. "పదేళ్లలో మీరేం చేశారో చెప్పండి.. వెయ్యి రోజుల్లో మేం ఏం చేశామో చెబుతాం. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి" అని రేవంత్ సవాల్ విసిరారు. మరోవైపు కాంగ్రెస్ హామీలు, పాలనా వైఫల్యాలు, అవినీతి ఆరోపణలను అసెంబ్లీ బయటా, లోపలా ఎండగడతామన్న దిశగా బీఆర్ఎస్ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. మొత్తానికి.. 'వెయ్యి రోజులు' ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమరానికి వేదికయ్యాయి. అధికార పక్షం కేసీఆర్ గైర్హాజరును అస్త్రంగా చేసుకుంటే.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ హామీలనే ఆయుధంగా మలుచుకుంటుంది.

# 'నీకు.. నాకు పోలికనా కేసీఆర్?'

(మొదటిపేజీ తరువాయి)

నిలదీశారు. తమ ప్రభుత్వం 15 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిందని, 3.48 కోట్ల మందికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోందని సీఎం చెప్పారు. ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, హైదరాబాద్‌లో పేదలకు లక్ష ఇళ్లు కడుతున్నామని తెలిపారు. సీఎం సహాయ నిధి కింద రూ.3,500 కోట్లు ఖర్చు చేశామని, రూ.2 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రిని నిర్మిస్తున్నామని వివరించారు. ఎస్సీ వర్గీకరణకు పరిష్కారం చూపడంతోపాటు బీసీ కులగణన చేపట్టామని పేర్కొన్నారు. "నేను వెయ్యి రోజుల్లో ఒక్క గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేశా. నువ్వు వెయ్యి రోజుల్లో ప్రజలకోసం ఒక్కరోజైన పనిచేశావా? ప్రభుత్వ ఉద్యోగి ఏడాదిపాటు విధులకు రాకపోతే చర్యలు తీసుకుంటారు. మరి ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించని కేసీఆర్‌ను ఏం చేయాలి?" అని రేవంత్ ప్రశ్నించారు. కేసీఆర్ భద్రత, వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసిందన్నారు. సెప్టెంబరు 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ రావాలని సవాల్ విసిరారు." పదేళ్లలో మీరేం చేశారో చెప్పండి.. వెయ్యి రోజుల్లో మేం ఏం చేశామో చెబుతాం. సభలోనే తేల్చుకుందాం "అన్నారు. కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆరు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ఒక్క 'ఆపరేటర్' చేతిలో ఇన్ని తాళాలా?

(మొదటిపేజీ తరువాయి)



మారింది. పీఎం శ్రీ పాఠశాలల బిల్లుల మంజూరు, సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల పేరోళ్ల విషయంలో డబ్బుల వసూళ్లు జరిగాయన్న ఆరోపణలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ ప్రక్రియల్లో సదరు ఉద్యోగికి అధికారికంగా ఏ స్థాయి యాక్సెస్ ఉంది? ఫైళ్లు ఆయన వద్దకు ఎందుకు వెళ్తున్నాయి? చెల్లింపుల ప్రక్రియలో ఎవరి ఆమోదం తర్వాత ఎవరి చేతుల మీదుగా ఫైళ్లు కదులుతున్నాయి? అనే అంశాలను పరిశీలిస్తే అసలు వ్యవహారం బయటపడే అవకాశముంది.

**బాధ్యత ఎవరిది?**

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రతి విభాగానికి అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ కీలకమైన పలు పనుల్లో ఒకే వ్యక్తి పేరు ఎందుకు వినిపిస్తోంది? అన్న ప్రశ్న తలెత్తుతోంది. బిల్లులు, పేరోళ్లు, వోచర్ల తయారీ వంటి అంశాలు ఒక్క ఉద్యోగి స్థాయిలోనే పూర్తయ్యేవి కావు. వివిధ దశల్లో పరిశీలన, ధ్రువీకరణ, ఆమోదం అవసరం. అలాంటప్పుడు ఆరోపణలు నిజమైతే ఇతర స్థాయిల్లో పర్యవేక్షణ ఏమైంది? ఎవరి నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నది తేలాల్సి ఉంది.

**స్టాక్ రిజిస్టర్ తెరిస్తే..?**

కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు సంబంధించిన ఫర్నిచర్, ల్యాబ్ సామగ్రిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో స్టాక్ రిజిస్టర్లు కీలకంగా మారనున్నాయి. ఏ పాఠశాలకు ఎంత సామగ్రి వచ్చింది? ఎప్పుడు పంపిణీ చేశారు? స్వీకరణ రసీదులున్నాయా? వోచర్లు ఎవరు రూపొందించారు? బిల్లులు ఎవరు ధ్రువీకరించారు? అనే అంశాలను సరిపోలిస్తే నిజానిజాలు తేలే అవకాశం ఉంది.

**ఆడిట్ పేరుతో వసూళ్లా?**

2024–26 కాలానికి సంబంధించిన ఆడిట్ సందర్భంగా పాఠశాలల నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు కూడా తీవ్రంగానే ఉన్నాయి. నిజంగా ఏదైనా అధికారిక ఆడిట్ ఖర్చు ఉంటే దానికి ప్రభుత్వ నిబంధనలు ఏమిటి? పాఠశాలల నుంచి నగదు తీసుకునే అధికారం ఎవరికైనా ఉందా? ఉంటే రసీదులు ఎక్కడ? లేకుంటే ఎవరి పేరుతో డబ్బులు వసూలయ్యాయన్నది తేలాల్సి ఉంది.

**సీసీ కెమెరా లేని చోటే కీలక పనులా?**

కార్యాలయంలోని ఇతర ప్రాంతాలు సీసీ కెమెరాల పరిధిలో ఉండగా, సదరు ఉద్యోగి పనిచేసే ప్రాంతంలో కెమెరా లేదన్న ఆరోపణ కూడా అనుమానాలకు కారణమవుతోంది. కెమెరాల ఏర్పాటుకు సంబంధించిన మ్యాప్, కొనుగోలు వివరాలు, నిర్వహణ రికార్డులను పరిశీలిస్తే అక్కడ కెమెరా లేకపోవడానికి కారణమేమిటో స్పష్టమవుతుంది.

**సీఆర్పీ జీతంపై ఫైలు ఏమంటోంది?**

భీమదేవరపల్లికి చెందిన ఓ సీఆర్పీ విధుల్లో లేని కాలానికి సంబంధించి జీతం చేయించారన్న ఆరోపణల నేపథ్యంలో హాజరు రికార్డు, పునర్నియామక ఉత్తర్వులు, పేరోల్, బ్యాంకు చెల్లింపు వివరాలు కీలకంగా మారాయి. రెండు నెలల జీతం ఏ ఆధారంతో మంజూరైంది? ఫైల్‌పై ఎవరు సంతకాలు చేశారు? అన్నది పరిశీలిస్తే ఇందులో ఎవరి పాత్ర ఎంతన్నది బయటపడుతుంది.

**ఒక్కరి కథేనా?.. వ్యవస్థ కథా?**

ఇప్పటి వరకు వస్తున్న ఆరోపణలు ఒక ఉద్యోగి చుట్టూ తిరుగుతున్నప్పటికీ.. అసలు ప్రశ్న మాత్రం వ్యవస్థపైనే ఉంది. అధికారిక బాధ్యతలకు మించి ఎవరైనా వ్యవహరించగలిగితే అందుకు అవకాశమిచ్చిందెవరు? పర్యవేక్షణలో లోపముందా? లేక ఎవరి అండతోనైనా వ్యవహారాలు సాగాయా? అన్న కోణంలో విచారణ జరగాల్సి ఉంది. సంబంధిత ఉద్యోగి వివరణతోపాటు పీఎం శ్రీ బిల్లులు, పేరోళ్లు, వోచర్లు, స్టాక్ రిజిస్టర్లు, ఆడిట్ రికార్డులు, సీసీ కెమెరాల ఏర్పాటు వివరాలు, సంబంధిత ఫైళ్ల మూమెంట్‌ను సమగ్రంగా పరిశీలిస్తేనే ఆరోపణల్లో నిజమెంత? బాధ్యత ఎవరిది? అన్నది తేలనుంది.

# 'చేయూత'కు మరో 15 రోజులు!

హైదరాబాద్, ఆగస్టు 31 (మన విశ్వం): చేయూత సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును మరో 15 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 31తో ముగియాల్సిన గడువును సెప్టెంబర్ 15 వరకు పెంచింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సెర్ఫ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

**నిర్ణీత గడువులోగా దరఖాస్తు**

చేసుకోలేకపోయిన అర్హులు, ముఖ్యంగా దివ్యాంగుల నుంచి గడువు పెంచాలంటూ విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అర్హత ఉన్న ఏ ఒక్కరూ అవకాశం కోల్పోకూడదనే ఉద్దేశంతో గడువు పొడిగించినట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రస్తుతం వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికుల కేటగిరీ ల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆదివారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 4,34,854 దరఖాస్తులు అందినట్లు సమాచారం. ప్రభుత్వం కొత్తగా 2.50లక్షల పింఛన్లు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో అర్హుల ఎంపికకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నారు. పొడిగించిన గడువును అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా దర ఖాస్తుల స్వీకరణలో పూర్తి సహకారం అందించాలని సంబంధిత అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.

# ప్రజలను తిప్పితే.. వేటే!

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడం సరికాదన్నారు. ప్రతి సమస్యను చట్టాలు, నిబంధనల పరిధిలో పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కుర్చీలకే పరిమితం కావొద్దు**

"కార్యాలయాల్లో కూర్చుని ఫైళ్లు చూస్తేనే సమస్యలు పరిష్కారం కావు. క్షేత్రస్థాయికి వెళ్లాలి. వాస్తవ పరిస్థితులను స్వయంగా పరిశీలించాలి" అని అధికారులకు సూచించారు. భూ సమస్యలపై క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. చిన్న సమస్య కోసం కూడా ప్రజలు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, తీసుకొస్తున్న సంస్కరణల ఫలాలు ప్రజలకు చేరేలా యంత్రాంగం పనిచేయాలని పొంగులేటి ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే అధికారుల ప్రథమ బాధ్యతని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు తమ తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమీక్షలో మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, డాక్టర్ భూక్య మురళీనాయక్, కె.ఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మామిడాల యశస్వినిరెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# వెయ్యి రోజుల పాలనపై 'సమరభేరి'

**– కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి: ఎమ్మెల్యే వివేకానంద్**
**– ఆరు గ్యారంటీల అమలేది?.. హామీలపై నిలదీయాలి**
**– సెప్టెంబరు 1 నుంచి 10 వరకు బీఆర్ఎస్ నిరసన కార్యాచరణ**




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (మన విశ్వం):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, ఆ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు గండిమైసమ్మలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వివేకానంద్‌తో పాటు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు సహా అనేక ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని నేతలు ఆరోపించారు. రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మికి తులం బంగారం, నిరుద్యోగుల సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని ప్రకటించారు.

**– నేటి నుంచి కార్యాచరణ**

సెప్టెంబరు 1న తెలంగాణ భవన్‌లో ప్రభుత్వంపై 'ఛార్జ్‌షీట్' విడుదల చేయనున్నట్లు తెలిపారు. 2న నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, 'బాకీ కార్డుల' పంపిణీ, 3న రైతులతో సమావేశాలు, 4న మహిళలతో నిరసనలు, 5న విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై ఆందోళనలు చేపట్టనున్నట్లు వివరించారు. 7 నుంచి 10 వరకు ప్రజావాణి కేంద్రాల్లో వినతిపత్రాలు సమర్పించడంతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆందోళనలకు మద్దతు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.
సమావేశంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా విభాగం, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంచార జాతుల అభ్యున్నతికి ప్రభుత్వం అండ

**– ములుగులో ఘనంగా సంచార జాతుల విమోచన దినోత్సవం**
**– విద్యతోనే సామాజిక, ఆర్థిక పురోగతి: బీసీ అభివృద్ధి అధికారి రామ్మోహన్**




**ములుగు జిల్లా ప్రతినిధి,ఆగస్టు31(మన విశ్వం) :** సంచార, విముక్త జాతుల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని ములుగు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.రామ్మోహన్ సూచించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగులోని జిల్లా సంక్షేమ భవన్‌లో సంచార జాతుల విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బి.రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంచార, విముక్త జాతుల ప్రతినిధులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ సంచార, విముక్త జాతుల అభ్యున్నతికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా ఆయా వర్గాల ప్రజలు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యతోనే సామాజిక, ఆర్థికంగా పురోగతి సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం, హక్కులు లభించేలా అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.
కార్యక్రమంలో సంచార జాతుల జిల్లా అధ్యక్షుడు బాణాల రాజుకుమార్‌తో పాటు పూసల, వీరభద్రియ, వడ్డెర, గంగిరెద్దుల కుల సంఘాల ప్రతినిధులు, సంచార, విముక్త జాతుల జిల్లా, మండల సంఘాల నాయకులు, బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపీడీఓను కలిసిన రంగాపురం కాంగ్రెస్ నాయకులు



**నల్లబెల్లి, ఆగస్టు 31(మన విశ్వం) :** మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పింగళి రమణ రెడ్డిని రంగాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.
గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుసుంబ రఘుపతి, మండల కార్యదర్శి జెట్టి రామ్మూర్తి ఆధ్వర్యంలో, రంగాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్ అధ్యక్షతన నాయకులు ఎంపీడీఓను కలిశారు. రంగాపురం గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలు, గ్రామ అభివృద్ధి, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓతో చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి తనవ ంతు సహకారం అందిస్తానని ఎంపీడీఓ పింగళి రమణ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడెపాక పోషాలు, కార్యదర్శి రాపర్తి మల్లయ్య, రాపర్తి అనిల్, మార్తా రమేష్, శనిగరం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. నూతన ఎంపీడీఓను కలిసిన రంగాపురం కాంగ్రెస్ నాయకులు నల్లబెల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పింగళి రమణ రెడ్డిని రంగాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుసుంబ రఘుపతి, మండల కార్యదర్శి జెట్టి రామ్మూర్తి ఆధ్వర్యంలో, రంగాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్ అధ్యక్షతన నాయకులు ఎంపీడీఓను కలిశారు. రంగాపురం గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలు, గ్రామ అభివృద్ధి, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓతో చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎంపీడీఓ పింగళి రమణ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడెపాక పోషాలు, కార్యదర్శి రాపర్తి మల్లయ్య, రాపర్తి అనిల్, మార్తా రమేష్, శనిగరం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలి



**నల్లబెల్లి,ఆగస్టు 31(మన విశ్వం):** మేడపల్లి--రాంపూర్--ఆశ్రవెల్లి గ్రామాల మధ్య అధ్వానంగా మారిన రహదారి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.
ఈ రహదారిపై మేడపల్లి, రాంపూర్, ఆశ్రవెల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, రైతులు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. రహదారి అధ్వానంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారినపడే పరిస్థితి నెలకొందన్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని తెలిపారు. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రజల రాకపోకలకు ఎంతో కీలకమైన ఈ రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, సాధ్యమైనంత త్వరగా నూతన రహదారి నిర్మాణ పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. సమస్యను పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రహదారి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి.. కాంగ్రెస్ గూండాయిజానికి నిదర్శనం: తడుక వినయ్ గౌడ్

**నల్లబెల్లి, ఆగస్టు 31(మన విశ్వం):** నాంపల్లిలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడిని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ రాజకీయ సంస్కృతికి, అసహన వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా వినయ్ గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయంగా బీజేపీని ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్ నాయకులకు లేదని ఆరోపించారు. ప్రజల మద్దతుతో బీజేపీ బలపడు తుండటాన్ని జీర్ణించుకోలేకనే దాడులు, విధ్వంసాలకు పాల ్పడుతున్నారని విమర్శించారు. రాజకీయ కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడులతో సమానమని అన్నారు. బీజేపీ కార్యకర్తలు తలచుకుంటే పరిస్థితులు ఎలా మారతాయో కాంగ్రెస్ నాయకులకు తెలుసని, అయితే బీజేపీ గూండాయిజాన్ని నమ్మకుండా రాజ్యాంగం, చట్టం, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ముందుకు సాగుతోందని తెలిపారు. తమ సంయమనాన్ని చేతగానితనంగా భావించవద్దని



హెచ్చరించారు.
రాజకీయంగా సమాధానం చెప్పాల్సిన చోట రాళ్లు, దాడులు, విధ్వంసాలకు పాల్పడటం చేతకాని రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. అధికారం ఉందనే అహంకారంతో బీజేపీ కార్యాలయాలపై దాడులు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన రాజకీయ గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.
దాడులతో బీజేపీని ఆపలేరని, బెదిరింపులతో బీజేపీ కార్యకర్తలను భయపెట్టలేరని వినయ్ గౌడ్ స్పష్టం చేశారు. కేసులతో బీజేపీ పోరాటాన్ని నిలువరించలేరని, తెలంగాణలో బీజేపీ మరింత బలంగా ఎదుగుతుందని అన్నారు.
రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ కార్యాలయాలపై దాడులకు తావులేకుండా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

# సమస్యల పరిష్కారానికి కృషి



**– ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (మన విశ్వం):** ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఆయన కలుసుకుని వినతులు స్వీకరించారు.
పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా.. కొన్నింటిపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మిగిలిన సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందిస్తానని పేర్కొన్నారు.
రోడ్డమేస్త్రినగర్ డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీశైలం గౌడ్‌కు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం

**– ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదలకు భరోసా: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**



**నల్లబెల్లి, ఆగస్టు 31 (మన విశ్వం):** ప్రతి పేద కుటుంబానికి సొంత గూడు కల్పించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన మాసంపెల్లి వనజ--అఖిల్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు.
కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలోత్ చరణ్, చిట్యాల తిరుపతిరెడ్డి, బత్తిని మల్లయ్య, బత్తిని మహేష్, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఫొటోలు చూపించి.. సమస్యలపై నిలదీత!

**– ద్వారకనగర్ సమస్యలు పరిష్కరించండి: కౌన్సిలర్ గజ్జల లావణ్య**
**– చెత్త, మురుగు, అధ్వాన రోడ్లతో ప్రజల ఇక్కట్లు**



**కొమురం భీం /కాగజ్‌నగర్,ఆగస్టు 31(మన విశ్వం):** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకనగర్ 8వ వార్డులో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కౌన్సిలర్ గజ్జల లావణ్య అధికారులను కోరారు. మున్సిపల్ సమీక్ష సమావేశంలో వార్డులోని సమస్యలకు సంబంధించిన ఫొటోలను కమిషనర్‌కు చూపిస్తూ పరిస్థితిని వివరించారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. వార్డులో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిలిచిపోవడం, రోడ్లు దెబ్బతినడం, వీధి దీపాలు సరిపడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫాగింగ్ చేపట్టకపోవడంతో దోమల బెడద పెరుగుతోందని, వీధి కుక్కల సమస్య కూడా స్థానికులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఈ సమస్యలపై గతంలోనూ అధికారులకు వినతిపత్రం అందజేసినా పరిష్కారం కాలేదని ఆమె పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ గజ్జల లావణ్య కోరారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



**నల్లబెల్లి,ఆగస్టు 31(మన విశ్వం):** నల్లబెల్లి మండలం రెలకుంట గ్రామానికి చెందిన జునూరు సాంబయ్య కుమారుడు యశ్వంత్, సాద్వికల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.
ఈ కార్యక్రమంలో నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సంచాలకుడు చార్ల శివారెడ్డి, గ్రామ సర్పంచ్ వాంకుడోత్ హేమలత శ్రీధర్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాలోత్ మోహన్, నర్సంపేట నియోజకవర్గ పరిధి కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు సిద్దూరి తిరుపతిరావు, నందిగామ సర్పంచ్ భూక్య భాస్కర్, బుచ్చిరెడ్డిపల్లె సర్పంచ్ భూక్య భద్రమ్మ బౌసింగ్, ఉప సర్పంచ్ ఎల్లబోయిన రఘుపతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంగల్దాస్ రమేష్, వార్డు సభ్యుడు జూనూరి సురేష్, మూడు రాజు, భూమ నర్సయ్య, నాగంపల్లి శ్యామ్ సుందర్, చల్వారి కిషన్‌తో పాటు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.14 వేల కోట్ల బకాయిలు.. చదువులు సాగేదెలా?

**- ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి**

**- 30 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందుల్లో: బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ**



**వరంగల్, ఆగస్టు 31 (మన విశ్వం):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా సుమారు 30 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.జేఏసీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు మాటేటి బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యంతో ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందన్నారు. ఫీజులు చెల్లించలేక కొందరు చదువులను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బకాయిలన్నింటినీ తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు రామగిరి యాదగిరిస్వామి, గొల్లపల్లి సురేష్‌గౌడ్, గుంపుల మల్లయ్య, కట్కూరి సునీల్, సిలివేరు రవి, బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**నర్సంపేట, ఆగస్టు 31(మన విశ్వం):** నర్సంపేట పట్టణంలోని 9వ నంబర్ రేషన్ దుకాణంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 22వ వార్డు కౌన్సిలర్ బాణాల ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నిరుపేద, అర్హత కలిగిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత సన్నబియ్యం పథకం ద్వారా పేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. రేషన్ కార్డుల మంజూరుతో పేద కుటుంబాలకు ఆహార భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్, వార్డు ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

## 22ఏపై బీజేపీ సమరభేరి సిద్ధిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట మహాధర్నా

**- ప్రజల భూముల హక్కులను కాపాడాల్సిందే**

**- పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నేతల స్పష్టీకరణ**




**ఎల్కతుర్తి, ఆగస్టు 31 (మన విశ్వం):** 22ఏ నిషేధిత జాబితాతో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సిద్ధిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆదివారం మహాధర్నా నిర్వహించారు. ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 22ఏ నిషేధిత జాబితాలో భూములు చేరడంతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భూములపై వారికి పూర్తి హక్కులు కల్పించాలని, 22ఏ కారణంగా తలెత్తిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులు, భూయజమానుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ధర్నాలో ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుడితాడు చిరంజీవి, మధుకర్‌రావు, షణ్ముఖ, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు తక్కలపల్లి సంపత్‌రావు, పెరుగు మధు, శక్తికేంద్రం ఇన్‌ఛార్జి శ్యాంసింగ్, మండల కోశాధికారి హింగే దేవరావు, సోషల్ మీడియా కన్వీనర్ పోల్ శివ తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్‌పూర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కమిటీలు



**- గ్రామ శాఖ అధ్యక్షులుగా నరేష్, అనిల్‌కుమార్**

**ఎల్కతుర్తి, ఆగస్టు 31 (మన విశ్వం):** ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నూతన గ్రామ కమిటీలను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ ఆదేశాల మేరకు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు కొయ్యడ రాజేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి జూపాక మధుకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి ఎల్తూరి వినయ్ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నామిండ్ల నరేష్, ఎంఎస్‌పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మంద అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడిగా వై.రాజేష్, ప్రధాన కార్యదర్శిగా ఎల్తూరి అజయ్‌ను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా జూపాక సుమన్, నామిండ్ల శివకృష్ణ, కొయ్యడ ప్రవీణ్‌కుమార్, జూపాక రాహుల్, మారేపల్లి దిలీప్, పవన్, చరణ్, రాజు తదితరులను నియమించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడతామని, తమపై ఉంచిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తామని తెలిపారు.

## దసరా నాటికి దేవాదుల సాగునీరు అందిస్తాం

**- బొంతగట్టు నాగారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయాలకు తావులేదు**

**- లంచం అడిగితే వెంటనే సమాచారం ఇవ్వండి**



**జనగామ, ఆగస్టు 31 (మన విశ్వం):** దసరా పండుగ నాటికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని, సెప్టెంబర్ చివరి నాటికి మోటార్ల ఏర్పాటు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. తరిగొప్పుల మండలంలోని బొంతగట్టు నాగారం గ్రామంలో వీఓ భవనం, అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.22 లక్షల అంచనా వ్యయంతో వీఓ భవనం, అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సర్పంచ్ మల్లన్న, పాలకవర్గం అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న తీరు అభినందనీయమన్నారు. గ్రామానికి అవసరమైన రోడ్లు, ఇతర మౌలిక వసతుల కోసం కూడా నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయాలకు ఎలాంటి తావులేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత, పేదరికమే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ఎవరూ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వవద్దని గ్రామస్తులకు సూచిస్తూ, ఎవరైనా లంచం అడిగితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్నప్పటికీ చెరువుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురవకపోతే వరి పంటకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో దేవాదుల ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. సెప్టెంబర్ చివరి వారంలో మోటార్ల ఏర్పాటు పూర్తి చేయడంతో పాటు వాటి నిర్వహణకు అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను కూడా వేగవంతం చేస్తున్నామని చెప్పారు. అన్ని పనులు ప్రణాళిక ప్రకారం పూర్తయితే అక్టోబర్ 15 నుంచి 20 మధ్య, దసరా నాటికి సాగునీరు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సాగునీరు అందుబాటులోకి వస్తే ప్రస్తుత పంటకు చివరి తడులు అందడమే కాకుండా రాబోయే యాసంగి పంటకు కూడా ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని, పేదలకు ఉచిత వైద్య సహాయం, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొంటూ బొంతగట్టు నాగారం గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారంపై కలెక్టర్ ఆదేశాలు

**- నిర్ణీత గడువులో సమస్యల పరిష్కారానికి సూచన**

**- ఐడీఓసీ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ**

**- ప్రతి దరఖాస్తుపై తక్షణ చర్యలు చేపట్టాలి**

**- మండల స్థాయిలోనూ ప్రజావాణి సేవలు**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 31 (మన విశ్వం):** ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి వినతిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర అంశాలపై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంతో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు వెంటనే పంపాలని, వెంటనే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. క్లిష్టమైన సమస్యల విషయంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పరిష్కార స్థితిని పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని కార్యాలయాల్లో జరిగే ప్రజావాణిని సద్వినియోగం చేసుకుని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయడం, ఉపాధి కల్పన, స్మశానవాటిక స్థలం కేటాయింపు, భూ రికార్డుల సమస్యల పరిష్కారం, గురుకుల పాఠశాలలో సీటు మార్పు వంటి అంశాలపై పలు వినతులు అందాయి. వాటిని పరిశీలించిన అధికారులు తదుపరి చర్యల కోసం సంబంధిత శాఖలకు పంపించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత

**- పెండింగ్ లేకుండా సమస్యలు పరిష్కరించాలి**

**- వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు**

**- సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**



**పెద్దపల్లి, ఆగస్టు 31 (మన విశ్వం):** ప్రజావాణిలో అందుతున్న అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన రాజవ్వ తన ఇద్దరు కుమారులు తనను పోషించడం లేదని, తన సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. అలాగే పెద్దపల్లి పట్టణానికి చెందిన బి. రజిత తాను వృత్తి విద్యలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేశానని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులో ఔట్‌సోర్సింగ్ ద్వారా అవకాశం కల్పించాలని కోరగా, సంబంధిత సొసైటీకి నివేదించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం మీర్జాంపేట గ్రామానికి చెందిన పుల్లూరు పద్మ తనకు అందుతున్న ఒంటరి మహిళ పెన్షన్ నిలిపివేశారని, తిరిగి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని కలెక్టర్ ఆదేశించారు.మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఓ రైతు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తన భూమి రికార్డుల్లో తప్పుగా నమోదు అయ్యిందని ఫిర్యాదు చేశారు. తనకు చెందిన 46 గుంటల భూమికి బదులుగా 47 గుంటలు నమోదు చేసినట్లు పేర్కొంటూ దానిని సవరించి తన భూమిని రక్షించాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

**- మండల ప్రజావాణిలో సీపీఎం వినతి**

**- బస్టాండ్, ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలి**

**- సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం చూపాలి: రత్నం రాజేందర్**





**ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31(మన విశ్వం):** ములుగు మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల బాధ్యుడు రత్నం ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల ప్రజావాణిలో పలు సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ములుగు బస్టాండ్ నిర్మాణం పూర్తికాకపోవడంతో జిల్లా కేంద్రానికి నిత్యం వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కనీసం తాత్కాలిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని తెలిపారు.

మండలంలో సాదాబైనామాల ద్వారా భూముల పట్టాల కోసం అనేక మంది రైతులు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు పరిష్కారం చూపలేదని ఆరోపించారు. రైతుల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు నిబంధనల ప్రకారం పట్టాలు అందించాలని కోరారు.ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలోనూ మౌలిక వసతుల కొరతతో రోగులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు సహా కనీస సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తోకల రవి, మండల నాయకులు కొర్ర రాజు, కొడెపాక చంటి, సమ్మన్న, రాకేష్, మధు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు

## రోజువారీ ప్రోటీన్ అవసరాలను సోయాబీన్స్ తీరుస్తాయా.. రోజుకు ఎంత తీసుకోవాలి..?



భారతీయుల ఆహారంలో ప్రోటీన్ లోపం ఒక ముఖ్యమైన పోషకాహార సమస్యగా మారుతోంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆహార సర్వేలు, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5), భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్)కు సంబంధించిన నివేదికల ప్రకారం.. 70 శాతానికి పైగా భారతీయుల్లో ప్రోటీన్ లోపం ఉన్నట్లు, దాదాపు 90 శాతం మందికి తమ రోజువారీ ప్రోటీన్ అవసరం ఎంత అన్నదానిపై స్పష్టమైన అవగాహన లేదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే మొక్కల ఆధారిత ప్రోటీన్ వనరులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రోజువారీ ఆహారంలో అన్నం, గోధుమ పిండి వంటి ధాన్యాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. వీటిలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండడంతోపాటు, శరీరానికి అందే ప్రోటీన్ పరిమాణం కూడా పరిమితంగానే ఉంటుంది. అందుకే ప్రోటీన్ అవసరాలను తీర్చుకునేందుకు సోయాబీన్స్ వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.ప్రోటీన్లకు మంచి వనరు..మొక్కల ఆధారిత ఆహారాల్లో సోయాబీన్స్ ను ప్రోటీన్లకు మంచి వనరుగా పరిగణిస్తారు. అయితే పచ్చి సోయాబీన్స్‌ను ఉడికించిన తర్వాత అందులో ఎంత ప్రోటీన్ ఉంటుంది ? ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్ రోజువారీ ప్రోటీన్ అవసరాల్లో ఎంతవరకు తీర్చగలదు ? అనే విషయాలు చాలామందికి తెలియవు. ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) రూపొందించిన ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ (ఐఎఫ్‌సీటీ) 2017 ప్రకారం.. 100 గ్రాముల పచ్చి సోయాబీన్స్‌లో సుమారు 35.58 గ్రాముల నుంచి 37.80 గ్రాముల వరకు ప్రోటీన్ ఉంటుంది. అయితే సోయాబీన్స్‌ను ఉడికించినప్పుడు అవి గణనీయమైన మొత్తంలో నీటిని పీల్చుకుంటాయి. దీంతో వాటి బరువు, పరిమాణం పెరుగుతుంది. సుమారు 170 గ్రాముల బరువుండే ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్‌లో దాదాపు 28 నుంచి 31 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది.ఎంత ప్రోటీన్ అవసరం..?ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ 2020 పోషకాహార మార్గదర్శకాల ప్రకారం.. శరీర బరువులో ప్రతి కిలోగ్రాముకు 0.66 గ్రాముల ప్రోటీన్ అవసరం ఉంటుందని అంచనా.

# ఫిర్యాదు చేయలేం - కొత్త ఓటరుగా నమోదు చేసుకోలేం



**హైదరాబాద్** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో నోటీసులు, ఫిర్యాదులు, అభ్యంత రాలు, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు నకు కావా ల్సిన ఫారాలు 6, 7, 8 అందు బాటులో లేకపో వడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతి పోలింగ్ బూత్ అధికారి (బీఎల్‌వో) వద్ద ఈ పత్రాలను ఉంచాలని ఎన్నికల సంఘం అధి కారులు ఆదేశాలు జారీ చేసినా కూడా ఇది ఎక్క డా అమలు కావడం లేదు. నోటీసులతో పాటు ఇతర ఫారాల ప్రింటింగ్ బాధ్యతలను జిల్లాల వారీగా ఆయా జిల్లా ఎన్నికల అధికారులకు (డీఈవోలకు) రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ కార్యాల యం అధికారులు ఇప్పటికే అప్పగించారు. ఫారాలు లేవని చెప్పిన అధికారులు : నియోజకవర్గాల వారీగా ఈ ఫారాలను ముద్రించుకోవాలని, ఈ బాధ్యతలను ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్వోలకు) ఇచ్చారు. ఈఆర్వోలు ఈ ప్రక్రియలో కేవలం నోటీసుల ప్రింటింగ్‌కే పరిమితం అయ్యారు. ఓటర్లకు కావాల్సిన పత్రాలను ఏదో విధంగా సర్దుబాటు చేయాలని ఏఈఆర్వోలు, బీఎల్‌వో సూపర్‌వై జర్లుకు ఈఆర్వోలు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇది ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో వీరు కూడా ఎక్కువగా పట్టించుకోవడం లేదు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన గ్రామ, వార్డు సభల్లో అందుకు సంబంధించిన ఫారాలు లేవని, మీసేవా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అక్కడి అధికారులు పేర్కొనడం గమనార్హం. 6, 7, 8 ఫారాలు అందుబాటులో లేకపోవడంపై పలు రాజకీయ పార్టీలు సైతం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఇటీవల ఓ జిల్లా పరిధిలో ఫారాలు 6, 7, 8 ప్రత్యేకంగా ప్రింటింగ్ చేయడం లేదని, ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లలో తీసుకోవాలని ఓటర్లకు చెప్పాలని స్థానిక ఎమ్మార్వోలకు అనధికారిక ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. దీంతో ఆ జిల్లా పరిధిలో ఎక్కడా వీటికి సంబంధించిన అప్లికేషన్ పేపర్లను అందించడం లేదు. సర్?లో భాగంగా ఎన్యూమ రేషన్ పత్రాల పంపిణీ, సర్వే సమయంలో తమ జిల్లా పరిధిలో అక్కడక్కడ మాత్రమే 10 నుంచి 20 మధ్య ఫారం-6ను అందించారని, అవి కూడా ఏమాత్రం సరిపోవని కొంతమంది బీఎల్‌వోలు అంటున్నారు. ఫారం-6, 7తో పాటు డిక్లరేషన్ పత్రాలు కూడా అవసరం అవుతాయని, అవి కూడా ఎక్కడా అందుబాటులో లేవని చెబుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్(క్యూర్) పరిధిలో వీటి అవసరం మరింత ఎక్కువగా ఉండనుంది. ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటరుగా రిజిస్టర్? కావడానికి అవకాశం ఉంది. ఇటీవల విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా జాబితాలో 73.39 లక్షల మంది ఏఎస్‌డీడీ (చిరునామాలో లేకపోవడం, నకిలీ, వలస వెళ్లడం, మృతి చెందడం) ఓటర్లను తొలగించినట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఎక్కడైనా ఈ ఓటర్లను పొరపాటున తొలగిస్తే మళ్లీ ఫారం-6 ద్వారా కొత్తగా నమోదు చేసుకోవాల్సిందేనని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. చాలా చోట్ల ఎన్యూమరేషన్ పేపర్లను పంపిణీ చేయకుండానే ఆ ఓటర్లను నేరుగా ఏఎస్‌డీడీ జాబితాలో చేర్చారు. కనీసం మళ్లీ కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6తో డిక్లరేషన్ పత్రాలు అందుబాటులో లేకపోతే ఎలా? అనే ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. పలువురు ఓటర్లకు గతంలో నివాసం ఉన్నచోటనే ఎన్యూమరేషన్ పత్రాలు అందించడంతో అక్కడే పత్రాలను పూర్తి చేసి ఇచ్చారు. వారు ప్రస్తుతం నివాసం ఉంటున్న అడ్రస్?కు మార్చుకోవాలంటే ఫారం-8 అవసరం. అలాగే పేర్లలో ఏ చిన్న అక్షర దోషాలు ఉన్నా సరి చేసుకోవాలన్నా ఇదే పత్రం కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ పత్రాలు కూడా ఎక్కడా అందుబాటులో ఉండటం లేదు. ఓటర్ల ముసాయిదా జాబితాలో అనుమానం ఉన్న ఓటర్లను తొలగించాలన్నా, ఫిర్యాదులు చేయాలన్నా ఫారం-7 తప్పనిసరిగా ఉండాలి.

# ఎడ్యుకేషన్ హబ్‌గా హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్



**సిద్దిపేట జిల్లా, ఆగస్టు 31:** జిల్లాలోని హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన కొనసాగుతోంది. ఉమ్మాపూర్‌లో రూ.7.28 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల బాలికలు, బాలుర నూతన హాస్టల్ భవనాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామన్నారు. వచ్చే సంవత్సరం ఆగస్టు లోపు ఇంజినీరింగ్ కళాశాలను పూర్తి చేసి జాతీయ జెండా ఎగరవేస్తామని చెప్పారు. తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ హుస్నాబాద్ నియోజకవర్గంలోనే పూర్తవుతుందని మంత్రి తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ కళాశాలకు త్వరలో మరో రెండు బస్సులను తీసుకొస్తామని వెల్లడించారు. విద్యా ప్రమాణాలు బాగుంటేనే విద్యా సంస్థలు అభివృద్ధి చెందుతాయన్నారు. త్వరలో హుస్నాబాద్‌కు కబడ్డీ అకాడమీని తీసుకొస్తామన్నారు. సౌకర్యాలు ర్యాంకులు తెచ్చే బాధ్యత మీది అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# మజ్లిస్‌లో ధిక్కార స్వరం.. రాజీనామాకు ఎమ్మెల్సీ రహ్మత్ ససేమిరా



**హైదరాబాద్:** రహ్మత్ బేగ్ వ్యవహారం మజ్లిస్ పార్టీకి తలనొప్పిలా మారింది. ఓ బాలికను లైంగికంగా వేధిం చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న రహ్మత్ బేగ్‌ను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని మజ్లిస్ అధిష్ఠానం ఆదేశించింది. కానీ, మూడు రోజులైనా ఆయన రాజీనామా చేయలేదు. పైగా.. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా చేయబోనంటూ ధిక్కార స్వరం వినిపించడం పార్టీ శ్రేణుల్లో కలకలం రేపుతోంది. మజ్లిస్ ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్.. ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఇటీవల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పార్టీ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. దాంతోపాటు ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే పరారీలో ఉన్న రహ్మత్ బేగ్ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

# తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీతో కీలక చర్చలు

**హైదరాబాద్ :**తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై మంగళ, బుధవారాల్లో ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్?తో కీలక చర్చలు జరిగే అవకాశాలున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు అంశంపై రేపు జలశక్తి శాఖ నిర్వహి ంచనున్న మీటింగ్?లో పాల్గొనేందుకు సోమ వారం లేదా మంగళవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి హస్తినకు వెళ్తారని విశ్వసనీయ సమాచారం. ఒకటో తేదీన అక్కడే ఉండి 2వ తేదీన ఢిల్లీలో జరిగే వై.ఎస్. అవార్డు ప్రదానో త్సవంలోనూ సీఎం పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహే శ్‌కుమార్‌గౌడ్ హాజరుకానున్నా రు. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రివరకు ఢిల్లీ చేరుకుంటారని తెలుస్తోంది. ఆయన వచ్చిన తర్వాత మంగళ, బుధవారాల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జు ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీలతో ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం



రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, భట్టి విక్రమార్క తెలంగాణ రాజకీయాలపై చర్చి స్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గ విస్తరణపై స్పష్టత కోసమే అగ్రనేతలతో రాష్ట్ర ముఖ్యనేతల భేటీ జరగబోతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు నేతలు కూడా తమకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధినాయకత్వాన్ని కోరేందుకు 1, 2 తేదీల్లో ఢిల్లీకి వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. వచ్చే నెల ఏడో తేదీన శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. దానికి ముందు రాష్ట్ర కేబినెట్ సమావేశం కూడా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ లోగా మంత్రివర్గంలో మార్పులు జరిగే అవకాశాలు లేకపోలేదని సీనియర్ నేతలు కూడా మాట్లాడుకుంటున్నారు. కేసీ రాగానే మారనున్న పరిణామాలు! : కేసీ వేణుగోపాల్ ఢిల్లీకి రాగానే తెలంగాణ నేతలతో జరిపే చర్చలతో పరిణామాలు మారతాయని నాయకులు అంచనా వేసుకుంటున్నారు. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహార శైలిపై క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ(డీఏసీ) విచారణ జరిపి ముమ్మర చర్యలు తీసుకోవాలని ఇటీవల పీసీసీకి నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ రిపోర్టును పీసీసీ మీనాక్షి నటరాజన్?కు అందజేసింది. ఆమె దాన్ని ఏఐసీసీకి పంపించారు. ఈ నివేదిక ఇచ్చిన తర్వాత భట్టి విక్రమార్క బెంగళూరు వెళ్లి ఖర్గేను ప్రత్యేకంగా కలిసి చర్చించి వచ్చారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలపై భట్టి ఖర్గేకు క్షుణ్ణంగా వివరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కమిటీ సిఫార్సులపై కేసీ వేణుగోపాల్, ఖర్గేలు రాష్ట్ర నేతలతో మంగళ, బుధవారాల్లో చర్చించే అవకాశాలున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఒకవేళ కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించి ఏఐసీసీ నిర్ణయిస్తే ఆమె స్థానంలో బీసీ వర్గాలకే చెందిన వేరే నేతలకు చోటుకల్పించాల్సి ఉంటుందని, ఎవరిని తీసుకోవాలనే అంశంపైనా చర్చలు కూడా జరగనున్నట్లు తెలుస్తోంది. పలువురు బీసీ సామాజిక వర్గాల నేతల పేర్లు పార్టీ పరిశీలనలో ఉన్నాయి. అది నిజమే కానీ : కేబినెట్ విస్తరణ జరిగితే ఒకరికేనా లేక ఇద్దరు, ముగ్గురికి చోటు కల్పించడానికి అవకాశాలునా న్నయా? అనే అంశంపైనా చర్చలు ఉంటాయని తెలుస్తోంది. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి కారణంగా నగరానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని కొందరు నేతలు గట్టిగా కోరుతున్నట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణ ఉంటుందనేది వాస్తవం. కానీ, ఎప్పుడు ఉంటుందనే కచ్చితమైన తేదీ మాత్రం ఏఐసీసీ నిర్ణయం తర్వాతే తెలుస్తుందని కాంగ్రెస్

# తెలంగాణలో గోదావరి పుష్కరాలు - రూ.1000 కోట్లతో ఘాట్‌ల అభివృద్ధి పనులు



**హైదరాబాద్** గోదావరి పుష్కరాలకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఘాట్‌లను అభివృద్ధి చేసేందుకు రూ.వెయ్యి కోట్లతో ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రతువులో నీటిపారుదల శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. 2027, జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటు ఘనంగా నిర్వహించే గోదావరి పుష్కరాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కోటి మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో మొత్తం అయిదు చోట్ల రూ.48.9 కోట్లతో స్నాన ఘాట్‌ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు మొదలయ్యాయి. రద్దీని అనుసరించి ఇంకా కొంత నిధితో తాత్కాలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తారు. తొలి దశ పనుల కోసం ఇప్పటికే శంకుస్థాపన కార్యక్రమం పూర్తయింది. మిగతా పనులు త్వరలో ప్రారంభించి పుష్కరాలు జరిగే నెల రోజుల ముందు అందుబాటులోకి తేనున్నట్టు ఇంజినీరింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. పినపాక, అశ్వాపురం మండలాల్లో : 2015లో జరిగిన పుష్కరాలతో పోల్చితే ప్రచార సమాచార వ్యవస్థ ఇప్పుడు చాలా వేగంగా పెరిగింది. అప్పటికంటే రోడ్లు, రవాణా మార్గాలు కూడా మెరుగ య్యాయి. కొవిడ్ ప్రభావంతో ఎక్కువ మంది లైఫ్ స్టైల్లో కూడా చాలా మార్పులు సంభవించాయి. టూరిజం, ఆధ్యాత్మిక సంచారానికి ఇప్పుడు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో వచ్చే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అశ్వాపురం మండలం చింతిర్యాల, పినపాక మండలం చింతలబయ్యా రం గ్రామాల్లో గోదావరి నది వద్ద రూ.2.25 కోట్ల చొప్పున రూ.4.5 కోట్లతో నూతనంగా ఘాట్‌లను నిర్మించాలని ప్రతిపాదించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవ తీసుకుని వీటిని మంజూరు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరినట్లు ఆయా వర్గాలు తెలిపాయి. చర్ల మండలంలోను ఒక ఘాట్ ఉంటే జనాభా రద్దీ సమస్యను సులభంగా పరిష్కరించవచ్చని భావిస్తున్నారు. భద్రాచలం కీలకం : బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఘాట్‌ల విశిష్టతను పరిశీలిస్తే ఇందులో భద్రాచలం అత్యంత కీలకం. రాములవారి దర్శనం కోసం వచ్చే భక్తులు పుష్కర స్నానం చేస్తారు. రోజుకి 4 లక్షల మంది భద్రాచలం ఘాట్‌కు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నా గతంలోని పుష్కరాల సమయంలోనే లోనే రోజుకు నాలుగైదు లక్షల చొప్పున జనాలు వచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాటకు అవకాశాలు లేని విధంగా కరకట్ట కింది భాగంలో రూ.కోటితో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సర్వీస్ రోడ్డును నిర్మించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. రూ.17.6 కోట్లతో జిల్లాలో పలుచోట్ల రోడ్లు, భవనాల శాఖ రోడ్లను నిర్మించేందుకు టెండర్‌లను ఫైనల్ చేసే పనిలో అధికారులు నిమగ్నమ య్యారు. భద్రాచలంలో పుష్కరాలు కీలకం : పుష్కరాలకు భద్రాచలం ఆలయానికి కలిపి ప్రభుత్వం రూ.351 కోట్ల నిధులను కేటాయించింది. వీటిలో మొదటి విడతగా భద్రాద్రి ఆలయ అభివృద్ధికి రూ.200.89 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో భద్రచలం ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు కూడా ప్రారంభం అయ్యాయి. ఆలయ ఆగమ శాస్త్రాన్ని అనుసరించి ఆలయ అర్చకులు వేద పండితులు వాస్తు నిపుణులు చెప్పినట్లుగా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత మే నెలలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమంలో అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసి భక్తుల నుంచి ప్రశంసలు కూడా పొందింది. కాళేశ్వరంలో ఈ అంత్య పుష్కరాలకు ప్రజల నుంచి చాలా ఆదరణ లభించింది.

# బీజేపీ ఆఫీస్‌పై దాడి.. కాంగ్రెస్‌పై బండి సంజయ్ ధ్వజం



**హైదరాబాద్, ఆగస్టు 31 :** హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యా లయం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేట ుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తు న్నారు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంట ెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా?..కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొ డ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్టు 31:** నగరంలోని చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. కంది సాగర్(31) అనే రిమాండ్ ఖైదీ.. జైలు వాష్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే గుర్తించిన జైలు సిబ్బంది హుటాహుటిన సాగర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఖైదీ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న సాగర్‌ను ఇటీవల నిజామాబాద్ జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. ఈ ఘటనపై జైలు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సాగర్ ఆత్మహత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

**హైదరాబాద్** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశి వరావు కీలక వ్యా ఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో మం త్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నా రు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత



చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయా ల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమే నని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో భూస మస్యల పైనా కూనంనేని ఆందో ళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శిం చారు. పైనా కూనంనేని ఆందో సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

మంగళవారం, సెప్టెంబర్ 01, 2026
మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వారా దినపత్రిక



# వెలిగొండతో వెలుగులు.. ఇది నినాదం కాదు, మా విధానం





**మార్కాపురం జిల్లా** :వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభంపై మార్కాపురం ప్రజలకు మంత్రి లోకేశ్ అభినందనలు 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నిజం చేశారని ప్రశంస కరవు, ఫ్లోరైడ్ సమస్యలకు ఈ ప్రాజె క్ట్‌తో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా ప్రాజెక్ట్ కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు ప్రత్యేక ధన్యవాదాలు ప్రజల అభిమానం పొ ందడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ దశాబ్దాల కల సాకారమవుతున్న చారిత్రక సందర్భంలో మార్కాపురం జిల్లా ప్రజలకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేడు వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంత దశ, దిశ మారబోతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు."వలసల కష్టాలకు సెలవు చెబుతూ, అభివృద్ధికి స్వాగతం పలుకుతున్న మార్కాపురం జిల్లా ప్రజలకు వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ శుభాకాంక్షలు" అని తన సందేశాన్ని ప్రారంభించారు. దాదాపు 30 ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న కలను ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నిజం చేస్తున్నారని కొనియా డారు. తీవ్ర కరవుతో అల్లాడుతున్న ఈ ప్రాం తాన్ని సస్యశ్యామలం చేయడంతో పాటు దశాబ్దాలుగా ప్రజలను పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ భూతం నుంచి విముక్తి కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని వివరించారు. "వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కేవలం సాగునీరే కాకుండా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతాం. తాగు, సాగు నీటి లభ్యతతో ఈ ప్రాంతంలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించి రైతుల ఆదాయాన్ని పెంచుతాం" అని లోకేశ్ తెలిపారు. ఈ బృహత్తర ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించి, తమ భూములను, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ప్రజా ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో పనిచేస్తోందని లోకేశ్ స్పష్టం చేశారు. "ప్రజలకు మంచి చేయడం ద్వారా వారి అభిమానాన్ని పొందడమే మేం కోరుకునే అసలైన క్రెడిట్. 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' అనేది కేవలం నినాదం కాదు, అది కూటమి ప్రభుత్వ విధానం" అంటూ ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. వెలిగొండ జలాలతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పయనిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## విశాఖలో ఘోర ప్రమాదం.. కారులో సజీవదహనమైన డ్రైవర్



**విశాఖపట్నం జిల్లా:** అత్యంత విషాదకరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆనందపురం-పెందుర్తి సర్వీస్ రోడ్డులో ఓ కారు లారీని ఢీకొట్టిన అనంతరం మంటలు చెలరేగడంతో, వాహనంలో ఉన్న డ్రైవర్ సజీవ దహనమయ్యారు. ఈ హృదయ విదారక ఘటన గాంధ్రిగుండం పరిధిలోని సత్తారువు జంక్షన్ వద్ద జరిగింది.వివరాల్లోకి వెళ్తే, జాతీయ రహదారి-16 సర్వీస్ రోడ్డుపై అతివేగంగా వెళ్తున్న ఓ కారు, తన ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారు ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే కారు మొత్తానికి అగ్నికీలలు వ్యాపించడంతో డ్రైవర్ బయటకు రాలేకపోయారు. వాహనం లోపలే చిక్కుకుపో యిన ఆయన, మంటల్లో కాలి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమా పక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, వారు వచ్చేసరికే కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఆనందపురం ఎస్ఐ శివ ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాద సమయంలో కారు నంబర్ ప్లేట్ ఊడిపోయి లారీకి అతుక్కుపోవడాన్ని పోలీసులు గుర్తించారు. ఆ నంబర్ ఆధారంగా మృతుని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విశాఖలో స్పా సెంటర్లపై మెరుపు దాడులు.. పోలీసుల అదుపులో యువతీ యువకులు




**విశాఖపట్నం,ఆగస్టు31:** నగరంలోని వివిధ ప్రాంతాల్లోని స్పా సెంటర్లపై పోలీసులు మెరుపు దాడుల చేశారు. విశాఖలోని మొత్తం121 సెంటర్లపై ఆదివారం రాత్రి ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఆధారాలను పోలీసులు గుర్తించారు. ఆ క్రమంలో నలుగురు మహిళలు, ముగ్గురు విటులతోపాటు నిర్వాహకులను గాజువాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే నలుగురు మహిళలను పోలీసులు రక్షించారు. ఆ తర్వాత వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గాజువాక, చిన గంట్యాడ, మీయామీ ఆయుర్వేదిక్, థాయ్ స్పాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో పోలీసులు ఈ దాడులు చేశారు.స్పా ముసుగులో పెద్ద ఎత్తున వ్యభిచారం జరుగుతున్నట్లు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నగర సీపీ ఆదేశాల మేరకు పోలీసులు మెరుపు దాడులు చేశారు.

# కరువు నేలకు కృష్ణా జలాలు తీసుకొచ్చిన అపర భగీరథుడు సీఎం చంద్రబాబు



**మార్కాపురం జిల్లా** మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు మూడు జిల్లాల్లో లక్షలాది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు అంటూ వెలిగొండ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు భావోద్వేగంతో స్పందించారు. కరవుతో అల్లాడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు తొలి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందన్నారు. వెలిగొండ జలాలు ప్రజల జీవితాల్లోకి అడుగుపెట్టడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని చంద్రబాబు వెల్లడించారు.చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యం: సొరంగం నుంచి తొలిసారి కృష్ణా జలాలు వెలువడిన దృశ్యం ఎంతో ఉద్వేగానికి గురిచేసిందని మంత్రి లోకేశ్ అన్నారు. 'వెలిగొండ జలసిరులు అభివృద్ధికి రెక్కలు' అంటూ ఓ వీడియోను లోకేశ్ పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చరిత్ర సృష్టించాలన్నా ఆ చరిత్రను తిరగరాయాలన్నా చంద్రబాబుకే సాధ్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. వెనుకబడిన మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు హార్టికల్చర్ హబ్‌లో చేర్చడం, వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమైందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పేరు ఎత్తే అర్హత వైఎస్సార్సీపీ నేతలకు లేదని మండిపడ్డారు. చరిత్రలో చిరస్థాయిగా : కరువు నేలకు కృష్ణమ్మ వరప్రదాయినిగా వెలిగొండ ప్రాజెక్టు నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకాశం, మార్కాపురం జిల్లా ప్రజల గుండెల్లో చంద్రబాబు చెరగని ముద్ర వేశారని వెలిగొండ ప్రారంభోత్సవం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమా అన్నారు.అపర భగీరథుడు : కరువు నేలకు కృష్ణా జలాలు తీసుకొచ్చిన అపర భగీరథుడు సీఎం చంద్రబాబు నాయుడు అని మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్‌రెడ్డి, మాజీమంత్రి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహ న్‌రెడ్డి అభివర్ణించారు. ఎన్టీఆర్ ఆశయం, చంద్రబాబు సంకల్పం, మూడు జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్ట్‌తో సాకారమవుతోందని తెలిపారు. వెలిగొండతో పాటు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల ఉత్తరాంధ్ర రైతులకు ఎంతో మేలు చేస్తుందని, గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకువస్తున్న సీఎం చంద్రబాబుకు హోంమంత్రి అనిత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రకాశం జిల్లాలో వలసల కష్టాలు తీరడంతో కరువు నేలపై సిరుల పంటలు పండనున్నాయని భరోసా ఇచ్చారని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం కేవలం 48 రోజుల్లోనే రూ.768 కోట్ల ఆర్అండ్ఆర్ పరిహారం అందించిందని తెలిపారు. వైఎస్సార్సీపీ ఐదేళ్ల పాలనలో వెలిగొండకు సుమారు రూ.840 కోట్లు కూడా ఖర్చు చేయలేదని, రూ.150 కోట్ల అప్పు మిగిల్చి వెళ్లిందని సోమిరెడ్డి విమర్శించారు. మూడు దశాబ్దాల తర్వాత : 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల నెరవేరిందని మంత్రి సంధ్యారాణి ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. 1996 మార్చి 5న చంద్రబాబు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును మూడు దశాబ్దాల తర్వాత అదే చంద్రబాబు చేతుల మీదుగా పూర్తి చేసి ప్రారంభించడం చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. ఆనాడు కొబ్బరికాయ కొట్టిన చంద్రబాబే ఈనాడు గుమ్మడికాయ కట్టి ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారని సంధ్యారాణి వెల్లడించారు. కరువు నేల ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలకు వెలిగొండ వరమని లక్షలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి ఫ్లోరైడ్ లేని స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని తెలిపారు. నల్లమల కొండల్లో 18.8 కిలోమీటర్ల మేర తవ్విన రెండు సొరంగాలు దేశంలోనే అతి పెద్దవని శ్రీశైలం నుంచి వరద జలాలను నల్లమల సాగర్‌కు తీసుకొచ్చే అద్భుతమైన ప్రాజెక్టు ఇదని వివరించారు.

# విశాఖకు ఏఐజీ.. రూ.2,000 కోట్లతో వెయ్యి పడకల హాస్పిటల్.. మంత్రి లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన



**విశాఖపట్నం:** పడింది. ఆసియాలోనే ప్రసిద్ధి గాంచిన ఏఐజీ (ఏఐజీ) హాస్పిటల్స్ ఇప్పుడు విశాఖపట్నంలో కొలువుదీరనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ మెగా హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.రూ.2,000 కోట్ల పెట్టుబడి, 9,000 ఉద్యోగాలు విశాఖలో నెలకొల్పనున్న ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం ఏఐజీ యాజమాన్యం ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. నిర్మాణం పూర్తయితే వెయ్యి పడకల సామర్థ్యంతో ఇది ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద వైద్య కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడగలదని అంచనా వేస్తున్నారు.రెండు దశల్లో నిర్మాణం.. ప్రపంచ స్థాయి సేవలు హాస్పిటల్ నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి సేవలు ప్రారంభించాలని భావిస్తున్నారు. మిగిలిన 350 పడకలతో రెండో దశను ఆ తర్వాత రెండేళ్లలో పూర్తి చేస్తారు. మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో హాస్పిటల్ క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, 50కి పైగా వైద్య విభాగాలతో ప్రపంచ స్థాయి సేవలు అందించనున్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా ఒకేచోట శిక్షణ, పరిశోధన, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలతో ఒక సంపూర్ణ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు.ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రణాళికలు, భవిష్యత్ సేవలకు సంబంధించి రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ)ను మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, ఏఐజీ వైస్ ఛైర్మన్ పీవీఎస్ రాజు, డైరెక్టర్ జీవీ రావు, సీఈవో సామ్ రిజ్వీ, జిల్లా కలెక్టర్ అభిషిక్త కిషోర్, పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ సహా పలువురు ఉన్నతాధికారులు, పాల్గొన్నారు.

## పరిశ్రమలకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు.. 33శాతం పచ్చదనం తప్పనిసరి



**అమరావతి, ఆగస్టు 31:** ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు.పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం వల్ల వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతన్నారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. ు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితమంటూ డ్రామాలు



**మార్కాపురం, ఆగస్టు 31:** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్వాకాలను మంత్రి నిమ్మల రామానాయుడు కడిగిపారేశారు. వెలిగొండ పేరుతో జగన్ చేసిన మోసాన్ని సభలో ఆసాంతం వివరించారు. 2019-2024 మధ్య కాలంలో వెలిగొండ పేరుతో చేసిన దుర్మార్గాలను ఎండగట్టారు. టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ మిషన్ తీయడానికి కనీస ప్రయత్నం చేయకుండానే.. రూ.2 వేల కోట్లకు పైగా పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితమంటూ ఆనాడు జగన్ డ్రామాలాడారంటూ విరుచుకుపడ్డారు.చంద్రబాబు హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న చర్యలు.. నిర్వాసితుల విషయంలో చంద్రబాబు పెద్ద మనస్సుతో వ్యవహరించారంటూ గత రెండేళ్ల కాలంలో జరిగిన పరిణామాలను మంత్రి వివరించారు. నాడు జగన్ ఇంకా పూర్తిగా తవ్వని సొరంగంలో కార్పెట్ వేసుకుని నడిచి నకిలీ జాతికి అంకితం కార్యక్రమాన్ని చేపట్టారని మండిపడ్డారు.

## లిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేస్తానంటూ నమ్మించి మోసం

**మార్కాపురం, ఆగస్టు 31:** వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశానంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ రెడ్డి మోసం చేశారంటూ ఎంపీ మాగుంట శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ వేదికపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్‌పై ఎంపీ విరుచుకుపడ్డారు. జగన్ ఓ మూర్ఖుడంటూ వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత ్సవం జరిగిన తీరు చూస్తుంటే భావోద్వేగంతో కళ్ల వెంబడి నీళ్లు తిరుగుతున్నాయన్నారు. మార్కాపురం ప్రజలు, రైతులకు మేలు చేసేలా వెలిగొండ ప్రాజెక్ట్‌ను సీఎం చంద్రబాబు పూర్తి చేశారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం సాయం అందించిందని



చెప్పారు. కులపోడని 2019 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకున్నామని.. వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశానంటూ ఇక్కడి ప్రజలను మోసం చేశారంటూ విరుచుకుపడ్డారు. మార్కాపురం జిల్లా ప్రజలకు ఇంత మేలు చేసిన చంద్రబాబుకు అండగా నిలుద్దామని ఎంపీ మాగుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పంచె కట్టుతో సాంప్రదాయంగా పూజా కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జలహారతి ఇచ్చిన అనంతరం కెనాల్ ఒడ్డున కృష్ణమ్మకు సీఎం సాష్టాంగ ప్రణామం చేయడంతో.. రైతులు, మహిళలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. అనంతరం వెలిగొండ ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించి.. జాతికి అంకితం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ వద్ద గేట్లు ఎత్తి నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేశారు. స్థానిక రైతులతో బటన్ నొక్కించి గేట్లు ఎత్తించారు సీఎం. ఆ వెంటనే కెనాల్ నుంచి పరవళ్లు తొక్కుతూ నల్లమలసాగర్ వైపు కృష్ణా జలాలు మళ్లాయి.నీటి విడుదలతో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడపలో కరవు ప్రాంతాలకు జలకళ సంతరించుకుంది. 1996 మార్చి 5 న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు.. 30 ఏళ్ల తరువాత దానిని పూర్తి చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, మంత్రులు ల దుర్గేష్, నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

# వైభవ్ సూర్యవంశీ చేజారిన శతకం



టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92)తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. దులీప్ ట్రోఫీ 2026లో ఈస్ట్ జోన్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. బెంగళూరులోని బీసీసీఐ సీఓఈ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ.. వన్డే తరహా బ్యాటింగ్‌తో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన ఫియర్‌లెస్ బ్యాటింగ్‌తో మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపించాడు. తనకే సాధ్యమైన భారీ సిక్సర్లతో బౌలర్లకు చుక్కలు చూపించాడు. 42 బంతుల్లోనే 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో అర్ధశతకం పూర్తి చేసుకున్న వైభవ్.. ఫాస్టెస్ట్ సెంచరీ దిశగా సాగాడు. కానీ హర్ష్‌దూబే బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. బౌండరీ లైన్‌పై అర్షద్ ఖాన్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ముగిసింది. 8 పరుగుల దూరంలో సెంచరీ చేజారడంతో వైభవ్ సూర్యవంశీ తీవ్ర అసహనానికి గురయ్యాడు. మైదానం వీడే క్రమంలో బ్యాట్‌ను బలంగా నేలకు కొట్టి అసహనం వ్యక్తం చేశాడు. దులీప్ ట్రోఫీ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ బాదిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్రకెక్కాడు. 15 ఏళ్ల 175 రోజుల వయసులో వైభవ్ ఈ ఘనత సాధించి 57 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 1969లో లక్ష్మణ్ సింగ్ 16 ఏళ్ల 23 రోజుల వయసులో దులీప్ ట్రోఫీలో హాఫ్ సెంచరీ బాదగా.. ఆ రికార్డ్‌ను తాజాగా వైభవ్ సూర్యవంశీ అధిగమించాడు. అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి తొలి వికెట్‌కు వైభవ్ 161 పరుగులు జోడించాడు. కానీ అతను ఔటైన తర్వాత ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. మరో 105 పరుగులు మాత్రమే జోడించి 57 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్(69) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సెంట్రల్ జోన్ బౌలర్లలో హర్ష్ దూబే(4/66) నాలుగు వికెట్లు తీయగా.. యశ్ ఠాకూర్, ఆర్యన్ పాండే మూడేసి వికెట్లు పడగొట్టారు. దాంతో ఈస్ట్ జోన్‌కు ఒక్క పరుగు కూడా ఆధిక్యం దక్కలేదు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 3 వికెట్లకు 45 పరుగులు చేసింది. కునాల్ చండేలా(2), ఆర్యన్ జుయాల్(8), రజత్ పాటిదార్(5) విఫలమవ్వగా.. క్రీజులో అమన్ మోకడే(23 బ్యాటింగ్), ఆర్యన్ పాండే(4 బ్యాటింగ్)లు ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్.. 80.1 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రింకూ సింగ్(88 బంతుల్లో 8 ఫోర్లతో 60) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఆర్య జుయల్(113 బంతుల్లో 6 ఫోర్లతో 46) హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్(3/56), అభిజిత్ సర్కార్(3/38) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ, మహమ్మద్ కౌనైన్ రెండేసి వికెట్లు తీసారు.

# హార్దిక్, నితీష్ రెడ్డి రీఎంట్రీ!

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ గెలిచిన భారత్.. మళ్లీ వైట్ బాల్ ఫార్మాట్‌కు సిద్ధమైంది. సొంతగడ్డపై సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే మూడు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య అఫ్గానిస్థాన్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఈ సిరీస్ ఆడే భారత జట్టును బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు. అజిత్ అగార్కర్ సారథ్యంలో సెలెక్షన్ కమిటీ.. టీమ్ ఎంపికపై ఫోకస్ పెట్టింది. మరో రెండు రోజుల్లో జట్టును ప్రకటించే అవకాశం ఉంది. గాయాలతో జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లో ఉన్న సంగతి తెలిసిందే. వాషింగ్టన్ సుందర్ సీవోఈలో ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం అతను చెన్నైలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. మరోవైపు జస్‌ప్రీత్ బుమ్రా పూర్తిగా కోలుకున్నా.. అతని విషయంలో టీమ్‌మేనేజ్‌మెంట్ ఆచితూచి వ్యవహరిస్తోంది. భవిష్యత్తులో కీలక టెస్ట్ టెస్ట్ సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు బుమ్రాను దూరంగా ఉంచే అవకాశాలు ఉన్నాయి. 'అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్ కోసం జట్టు ఎంపికపై సెలెక్షన్ కమిటీ ఫోకస్ పెట్టింది. గాయాల నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించే ఆటగాళ్లను పరిగణనలోకి తీసుకుంటారు. నితీష్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా చాలా రోజుల నుంచి సీఓఈలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నారు. వ్యక్తిగత కమిట్‌మెంట్స్ కోసం అప్పుడప్పుడు బయటకు వెళ్లినా ఎక్కువ సమయం సీఓఈలోనే గడిపారు. హార్దిక్ పాండ్యా అయితే బెంగళూరులోనే స్థిరపడ్డాడు. సుందర్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సెలెక్షన్స్‌కు అందుబాటులోకి వస్తాడు.'అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా పేరును కూడా సెలెక్టర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాటింగ్ సామర్థ్యంతో పాటు టీ20 ఫార్మాట్‌కు తగ్గట్లు బౌలింగ్ చేసే కృనాల్‌ను టీమిండియాలోకి తీసుకోవాలని సెలెక్టర్లు భావిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన స్థానాన్ని నిలబెట్టుకోనున్నాడు. అఫ్గాన్‌తో భారత టీ20 జట్టు(అంచనా) వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), ఇషాన్ కిషన్, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్/గుర్నూర్ బ్రార్, కృనాల్ పాండ్యా/వాషింగ్టన్ సుందర్, యశ్ ఠాకూర్, ప్రసిధ్ కృష్ణ.




# తొలి రౌండ్‌లోనే ముగిసిన జకోవిచ్ ప్రయాణం

తీవ్రమైన ఎండ, తేమ, అనారోగ్యం, శారీరక అలసటతో పోరాడిన జకోవిచ్.. అర్జెంటీనా ఆటగాడు మరియానో ??నవోన్‌తో జరిగిన మారథాన్ ఐదు సెట్ల పోరులో 6-7, 7-5, 6-4, 2-6, 1-6 తేడాతో ఓటమిపాలయ్యాడు. ఆర్థర్ యాష్ స్టేడియంలో మ్యాచ్ ఆరంభం నుంచే జకోవిచ్ శారీరకంగా ఇబ్బంది పడుతూ కనిపించాడు. న్యూయార్క్‌లోని తీవ్ర ఉక్కపోత, తేమ వాతావరణం వల్ల తలపై పదే పదే ఐస్ బ్యాగ్ పెట్టుకున్నాడు. వర్షం కారణంగా స్టేడియం రూఫ్ మూసివేసినప్పుడు ఏసీ ఆన్ చేయాలని సూపర్వైజర్‌ను కూడా కోరాడు. మూడో సెట్ ఆరో గేమ్‌లో పరిస్థితి మరింత విషమించి, జకోవిచ్ కోర్టు వెనుకభాగంలో పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. టోర్నమెంట్ ఫిజియో అతనికి మాత్రలు అందించగా, కోర్టు పక్కనుంచి సహాయక బృందం ద్రవాలు అందించింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో 6-7తో కోల్పోయినప్పటికీ, తీవ్రమైన శారీరక ఇబ్బందుల నడుమ జకోవిచ్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండో సెట్‌ను 7-5తో, మూడో సెట్‌ను 6-4తో గెలుచుకుని విజయానికి కేవలం ఒక్క సెట్ దూరంలో నిలిచాడు. అయితే, యువ ఆటగాడు నవోన్ తగ్గకుండా నాలుగో సెట్‌ను 6-2తో గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. ఐదో సెట్‌లో నవోన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 4-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అప్పటికే శరీరం సహకరించక, శక్తి పూర్తిగా క్షీణించడంతో మ్యాచ్ చేజారిపోతోందని గ్రహించిన జకోవిచ్ కోర్టులోనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. గ్యాలరీలో ఉన్న ఆయన భార్య జెలెనా కూడా తీవ్ర ఆందోళనకు గురైంది. నవోన్ ఏమాత్రం తడబడకుండా ఐదో సెట్‌ను 6-1తో ముగించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. 25వ టైటిల్ కల నిరీక్షణ: మార్గరెట్ కోర్ట్ రికార్డును అధిగమించి 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలవాలన్న జకోవిచ్ కల ఈ ఓటమితో ప్రస్తుతానికి ఆగింది. జిమ్మీ కానర్స్ రికార్డు మిస్: యూఎస్ ఓపెన్‌లో జిమ్మీ కానర్స్ పేరిట ఉన్న 98 విజయాల రికార్డును దాటడానికి జకోవిచ్‌కు ఇంకా నాలుగు విజయాలు అవసరమున్న సమయంలో ఈ ఓటమి ఎదురైంది. 18 ఏళ్ల అజేయ రికార్డుకు తెర: గ్రాండ్‌స్లామ్ టోర్నీల తొలి రౌండ్లలో వరుసగా 78 మ్యాచ్‌లు గెలిచిన జకోవిచ్ రికార్డుకు ఈ మ్యాచ్‌తో తెరపడింది. గతంలో 2006 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్ గోల్డ్‌స్టీన్ చేతిలో ఓడిన తర్వాత, మళ్లీ ఇన్నాళ్లకు జకోవిచ్ గ్రాండ్‌స్లామ్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

ఫుట్‌బాల్ ప్రపంచంలో సంచలన నిర్ణయం చోటుచేసుకుంది. అర్జెంటీనా స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించారు. ఇకపై అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించబోనని ఆయన వెల్లడించారు. ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్‌తో ఓటమి ఎదురైన రెండు రోజుల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెస్సీ తెలిపారు. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. జాతీయ జట్టుకు దూరమవ్వాలనే నిర్ణయం ఎంతో బాధాకరంగా ఉందని మెస్సీ పేర్కొన్నారు. చాలా కాలంగా ఆలోచించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ఇన్నేళ్లుగా అర్జెంటీనా జెర్సీ కోసం తన శక్తిమేర పోరాడానని, దేశ ప్రజలను సంతోషపెట్టడం, అర్జెంటీనాగా గర్వపడేలా చేయడం తనకు ఎప్పుడూ ముఖ్యమని వివరించారు. మెస్సీ తన ప్రకటనలో.. ఇది తనను తీవ్రంగా కలచివేసిన నిర్ణయమని, ఇప్పటికీ ఆ బాధ తనలో ఉందని తెలిపారు. ఇటీవలి సంవత్సరాల్లో జట్టుతో కలిసి ఎన్నో విజయాలు సాధించినప్పటికీ, అంతకుముందు కాలంలోనూ జాతీయ జట్టు కోసం పూర్తిస్థాయిలో కష్టపడ్డానని గుర్తుచేసుకున్నారు. తన అంతర్జాతీయ కెరీర్‌లో చివరి దశకు చేరుకున్నానని మెస్సీ అభిప్రాయపడ్డారు. కొన్ని అధ్యాయాలు ముగిసే సమయం వచ్చిందని, వాటిలో జాతీయ జట్టు అధ్యాయం ముగియడం తనకు ఎంతో బాధ కలిగిస్తోందన్నారు. అర్జెంటీనా జట్టులో భాగం కావడాన్ని తాను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటానని చెప్పారు. తనవంతుగా ఇవ్వాల్సినదంతా ఇచ్చేశానని, ఇక తన స్థానాన్ని కొత్త తరం ఆటగాళ్లకు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. జాతీయ జట్టుకు మద్దతుగా నిలిచిన అభిమానులకు మెస్సీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్లుగా తనపై చూపిన ప్రేమ, మద్దతును ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. ఇకపై స్టేడియం లోపల నుంచి అభిమానుల గొంతులు వినడం మిస్ అవుతానని, అయితే బయట నుంచి అర్జెంటీనా జట్టుకు మద్దతు ఇస్తూ ఉంటానని తెలిపారు. మంచి సమయాల్లోనే కాకుండా, ముఖ్యంగా కష్టకాలంలో జట్టుకు అండగా ఉంటానని చెప్పారు. తన కుటుంబానికి, ఈ ప్రయాణంలో తనతో కలిసి నడిచిన కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, అధికారులు, సిబ్బందికి కూడా మెస్సీ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రయాణం అందమైనదే కాకుండా ఎంతో కఠినమైనదని, అయినప్పటికీ తనకు ఎన్నో మరచిపోలేని జ్ఞాపకాలను అందించిందన్నారు. తన సహచరులతో కలిసి అభిమానులు కలలో కూడా ఊహించని ఎన్నో క్షణాలను సృష్టించగలిగామని మెస్సీ అన్నారు. ఆ అనుభవం తనకు అద్భుతంగా అనిపించిందని పేర్కొంటూ అభిమానులపై తన ప్రేమను వ్యక్తం చేశారు. చివరగా "అర్జెంటీనావాడిగా పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు" అంటూ భావోద్వేగ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం "లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన ప్రకటనను ముగించారు.



# ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన

ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. మూడు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్థాన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. ఇంగ్లండ్‌కు కనీస పోటీ ఇవ్వలేకపోయింది. తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో చిత్తయిన పాకిస్థాన్.. తాజాగా లార్డ్స్ టెస్ట్‌లో 194 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.దాంతో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 0-2తో కోల్పోయింది. ఈ పరాజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. పాకిస్థాన్‌తో పాటు ఇంగ్లండ్ కూడా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరలేని పరిస్థితి నెలకొంది. ఈ పరాజయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్‌తో పాటు ఇమామ్ ఉల్ హక్‌ను జట్టు నుంచి తప్పించి పాకిస్థాన్‌కు పంపించాలని నిర్ణయించిందని జియో న్యూస్ పేర్కొంది. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు హైలెవెల్ మీటింగ్ నిర్వహించిందని కూడా తెలిపింది. ఈ సమావేశంలో పీసీబీ ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీ, సీఓఓ సుమైర్ అహ్మద్, పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నజీర్, సీనియర్ సెలెక్టర్ అకీబ్ జావెద్, పరిమిత ఓవర్ల హెడ్ కోచ్ మైక్ హెస్సెన్ హాజరయ్యారని పేర్కొంది. ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ కంటే పాకిస్థాన్ ఘోర పరాజయాలే తీవ్ర అసంతృప్తికి గురి చేశాయని పీసీబీ ఛైర్మెన్ అన్నట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. 'రెండో టెస్టు సందర్భంగా స్కై స్పోర్ట్స్‌లో ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ ప్రసారం కావడం కూడా అధికార వర్గాలను కలవరపెట్టింది. కానీ అన్నింటికన్నా ఎక్కువగా.. మీడియాలో పాకిస్తాన్ జట్టును చిత్రీకరించిన తీరు, వారి ప్రదర్శనే ఆందోళన కలిగించాయి. ఇమామ్ తీవ్ర చిక్కుల్లో ఉన్నాడు. అతని స్థానంలో అబ్దుల్లా ఫజల్ జట్టులో చేరుతాడు.'అని ఓ పీసీబీ అధికారి తెలిపాడు. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను తప్పించాలనే యోచనలో పీసబీ ఉన్నట్లు తెలుస్తోంది. సర్ఫరాజ్ అహ్మద్ స్థానంలో పరిమిత ఓవర్ల కోచ్ మైక్ హెస్సేన్‌కే టెస్ట్ టీమ్ బాధ్యతలు కూడా అప్పగించనున్నారని ప్రచారం జరుగుతోంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే మూడో టెస్ట్‌కు ముందే ఈ నిర్ణయం వెలువడనుందని జియో న్యూస్ పేర్కొంది.




# ఆసియా కప్: థాయిలాండ్‌పై భారత్ ఘన విజయం



**హైదరాబాద్ :** మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత జట్టు ఘన విజయం సాధించి టోర్నీని ఘనంగా ప్రారంభించింది. థాయ్‌లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 94 పరుగుల భారీ తేడాతో విజయం నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన ఈ పోరులో ఓపెనర్ షఫాలీ వర్మ మెరుపు అర్ధశతకంతో సత్తా చాటగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 36 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ప్రతీక రావల్ 18 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు చేసి రాణించింది. థాయ్‌లాండ్ బౌలర్లలో లావోమి 3 వికెట్లు పడగొట్టగా, సునిద 2 వికెట్లు తీసింది. అనంతరం 160 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్, భారత బౌలర్ల ధాటికి తలవంచింది. ఆ జట్టు 16.1 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలింది. థాయ్‌లాండ్ బ్యాటర్లలో కొంచరోయెంకాయ్ (41) మాత్రమే ఒంటరి పోరాటం చేయగా, మిగతా వారెవరూ కనీస పోరాట పటిమ కనబరచలేకపోయారు.

# కిరణ్ అబ్బవరం మూవీ హతః




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే




దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# 200 కోట్ల వైపు ఇరుముడి దూకుడు

## ఇరుముడి కట్టు వీడగియో సాంగ్ విడుదల చేసిన మేకర్స్




మాస్ మహారాజా రవితేజకు మరో బ్లాక్‌బస్టర్ హిట్ దక్కింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి దూసుకెళ్తోంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ప్రస్తుతం అదే జోరును కొనసాగిస్తూ మరో భారీ మైలురాయిని అందుకునే దిశగా పరుగులు పెడుతోంది. 'ఇరుముడి' సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తాజా టికెట్ సేల్స్‌నే నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ద్వారా ఇప్పటివరకు ఈ సినిమా 70 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఒక ప్రాంతీయ సినిమా ఈ స్థాయిలో టికెట్లను విక్రయించడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఇరుముడి' ఇప్పుడు రూ.200 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ దిశగా అడుగులు వేస్తోంది. ఇకపోతే రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ కమర్షియల్ అంశాలతో పాటు కథకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వడం 'ఇరుముడి' విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెబుతున్నారు. దర్శకుడు శివ నిర్వాణ తనదైన శైలిలో కథను తెరకెక్కించడంతో ప్రేక్షకులు సినిమాతో కనెక్ట్ అవుతున్నారని చిత్ర బృందం భావిస్తోంది. రవితేజ తన పాత్రలో మాస్ ఎనర్జీతో పాటు భావోద్వేగాలను కూడా బలంగా పండించారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలు ప్రేక్షకులను కదిలి స్తున్నాయని, ముఖ్యంగా క్లైమాక్స్ ఎమోషనల్ సీన్స్‌కు థియేటర్లలో మంచి స్పందన వస్తుంది. అయ్యప్ప స్వామి భక్తి, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలకమైన 'ఇరుముడి కట్టు' వీడియో సాంగ్‌ని మేకర్స్ ఘనంగా విడుదల చేశారు. 'కట్టు కట్టు ఇరుముడి కట్టు' అంటూ సాగే ఈ గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాటకు అందించిన ట్యూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హై-వోల్టేజ్ భక్తి సంగీతం, అయ్యప్ప మాలధారుల నృత్యాలు, 'స్వామియే శరణమయ్యప్ప' అనే నామస్మరణతో సాగుతున్న ఈ గీతం శ్రోతలను ఆకట్టుకుంటోంది. పాటను వింటున్న సమయంలోనే భక్తిభావం కలిగేలా మ్యూజిక్‌ను కంపోజ్ చేసిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా మాలధారుల డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ బీట్స్ పాటకు మరింత జోష్‌ను తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. 'ఇరుముడి'లో ఈ పాటతో పాటు 'విల్లాలి వీరుడు', 'మ్లలెపూల పల్లకి' వంటి భక్తి గీతాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.

---------




# రోమాంచకం ట్రైలర్ కు అదిరిపోయే రెస్పాన్స్

'యానిమల్', 'అర్జున్ రెడ్డి' వంటి ఇంటెన్స్, వయొలెంట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, ఆయన సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ నుంచి ఓ యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ వస్తుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో యువ నటుడు సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, 'రోమాంచకం' మూవీ ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. ఊహించినట్టుగానే, ఈ ట్రైలర్‌కు ప్రేక్షకులు, నెటిజన్ల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. సందీప్ వంగా బ్రాండ్‌కు పూర్తి భిన్నంగా, ఆహ్లాదకరమైన వినోదంతో ట్రైలర్ ఉండటంతో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది.
'మేమ్ ఫేమస్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సనిల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. వేణుగోపాల్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ట్రైలర్ చూస్తుంటే ఇదొక కలర్‌ఫుల్, ఎనర్జిటిక్ రొమాంటిక్ కామెడీ అని స్పష్టమవుతోంది. డేటింగ్ యాప్ స్టార్టప్ నడిపే హీరో, తన వ్యాపారం కోసం చేసే పరిశోధనలో భాగంగా చెన్నైకి చెందిన హీరోయిన్‌తో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత అతని స్నేహితుల గ్యాంగ్‌తో కలిసి చేసే పనులు కొన్ని అనూహ్య సంఘటనలకు దారితీస్తాయి. ఈ క్రమంలో వచ్చే కామెడీ, సంఘర్షణలు ఆసక్తికరంగా ఉన్నాయి.
"రాస్తే రామాయణం... తీస్తే రోమాంచకం" అంటూ హీరో చెప్పే డైలాగ్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉండటంతో పాటు, నేపథ్య సంగీతం కూడా చాలా క్యాచీగా ఆకట్టుకుంటోంది. హింసకు తావు లేకుండా, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా అలరించేలా ఒక క్లీన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచడంలో పూర్తిగా సక్సెస్ అయింది. ఈ చిత్రం 2026 సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం



వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.

"MANA VISHWAM" vide PRGI Registration No.
"TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda,